9440662699 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv rajadhanivartalu RNI No. APTEL 2015/ 66622

పేపర్లో ప్రకటనల
కొరకు సంప్రదించండి
నెం: 94406 62699
www.rajadhanivartalu.com


# రాజధాని వార్తలు

Voice of Voiceless







అమరావతి సంపుటి : 2 సంచిక 51, పేజీలు 4 రూ. 2/- | ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక | సోమవారం 11 - ఆదివారం 17, సెప్టెంబర్-2017

## రాజధాని నిర్మాణం కోసం

# కమిటీ నివేదిక భేష్



**రాజధాని వార్తలు, ప్రత్యేక ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి శివరామకృష్ణ కమిటీ నివేదిక అత్యుత్తమమైందని ప్రభుత్వం దాన్ని పరిగణలోకి తీసుకుని ఉంటే బావుండేదని మాజీ ప్రధానకార్యదర్శి ఐవైఆర్ కృష్ణారావు గ్రీన్ సాలిడర్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పేర్కొన్నారు. ప్రస్తుతం రూపొందుతున్న రాజధానిలో మధ్య, దిగువ మధ్య కుటుంబాలకు ఏమాత్రం చోటులేకుండా పోయే ప్రమాదం ఉందని కేవలం రియల్ ఎస్టేట్‌కు లాభం చేకూర్చే విధంగా రూపొందడం


**పరిగణలోకి తీసుకోకపోవడం విచారకరం : ఐవైఆర్ కృష్ణారావు**

బాధాకరమన్నారు.

చాలా మంది ఎందుకు ఈ విషయంపై ఇప్పుడు మాట్లాడుతున్నారని ప్రశ్నిస్తారని అయితే ప్రభుత్వ విధివిధానాల పరిమితులకు లోబడి పరిపాలనా బాధ్యతలు నిర్వహించాల్సి

- మిగతా 2 లో

# 'వైరల్' విజృంభణ



- కానరాని వైద్యులు
- జాడలేని వైద్య శిబిరాలు..

**రా.వా. ప్రతినిధి- అమరావతి:** సీజనల్ వ్యాధులను జనాలు బెంబేలెత్తుతున్నారు. కొద్దిపాటి జ్వరమొచ్చినా, జలుబు చేసినా ఆందోళన చెందే పరిస్థితులున్నాయి.రాష్ట్రంలో ఏ గ్రామం చూసినా వైరల్ జ్వరాలు తాండవిస్తున్నాయి. మంచం పట్టిన పల్లెవాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. విషజ్వరాల ప్రభావంతో కిటకిటలాడుతున్నాయి. ఏటా ముందస్తు చర్యలతో ప్రభుత్వం పారిశుధ్యంపై ప్రత్యేకశ్రద్ధ కనబరిచి, పంచాయతీలో, మునిసిపాలిటీ సిబ్బందితో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేవారు. తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోనేవారు, అయితే ప్రస్తుతం పారిశుద్ధం పడకేయడంతో వ్యాధులు పలకరిస్తున్నాయి.

### పడకేసిన పరిశుధ్యం

రాష్ట్రంలో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. ఎక్కడ చెత్త అక్కడే పేరుకుపోయి పరిసరాలు కంపుకొడుతున్నాయి. ప్రముఖ దేవాలయాలు ఉన్న ప్రాంతాల్లో సైతం పారిశుధ్యం లోపం కనబడుతోంది. ప్రధానంగా పంచాయతీల పరిధిలో ఈ నిర్లక్ష్యం ప్రస్ఫుటమవుతోంది. ముఖ్య కూడళ్లల్లో చెత్తాచెదారం భారీగా పేరుకుపోయి దళితవాడలు, బీసీ కాలనీలు దారుణస్థితిలో దర్శనమిస్తున్నాయి. ఈ కారణంగా దోమలు ప్రబలి విషజ్వరాలకు కారణమవుతున్నాయి.

### మెడికల్ క్యాంపుల జాడేది ?

సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ప్రాథమిక వైద్యుల ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించేది. ప్రస్తుతం వాటి జాడ కానరావడం లేదు. చిన్నపాటి జ్వరమొచ్చినా ప్రాథమిక వైద్యశాలకో, ప్రైవేటు ఆస్పత్రికో పరుగెత్తాల్సిన పరిస్థితి ఉంది.

గిరిజన తండాలు, కొండప్రాంతాలు, అటవీ ప్రాంతాల్లో నివసించే వారి పరిస్థితి మరీ దయనీయంగా మారింది. పట్టించుకునే వారు లేక పట్టెమంచానికే పరిమితిమవుతున్నారు. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నారు.

### 'ప్రైవేటు' దోపిడీ

కొద్దిపాటి అనారోగ్యంతో ఆస్పత్రికి వెళితే వైద్యులు పరీక్షల పేరుతో అడ్డంగా దోచేస్తున్నారు. తొలుత అనారోగ్యం బారిపడిన రోగులకు కొంతమంది ఆర్ఎంపీలు ప్రాథమిక వైద్యం చేసి, అనంతరం భయపెట్టి పెద్దసుపత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు. ముందుగా వీరికి అనుసంధానంగా ఉన్న ల్యాబ్‌లలో రక్తపరీక్షల పేరిట భారీగా దండుకుంటున్నారు. అనంతరం ఫలానా ఆస్పత్రికి వెళ్లండి, లేదంటే ప్రమాదమని చెబుతున్నారు.

### కరువైన దాడులు

గుర్తింపులేని వైద్యులపై స్థానిక, జిల్లా వైద్యశాఖ దాడులు చేయకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే క్రమంలో ల్యాబ్‌లు సైతం ఆర్ఎంపీ వైద్యులతో కలిసి రోగులని దోచుకుంటున్నా వైద్యశాఖాధికారాలు మిన్నకుండిపోతున్నారు. ప్రభుత్వం ముందుగా వైద్యశాలల నిర్వహణ, వైద్యుల గుర్తింపై విచారణచేస్తే రోగాల బారినపడిన వారికి కొంత ఉపశమనం కలుగే అవకాశం ఉంది.

## మాగోడు వినరే ? : రేషన్ డీలర్లు



**రాజధాని డెస్క్ :** సంక్షేమ కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ముందన్నప్పటికీ బతుకులు మాత్రం ఎక్కువ వేసిన గొంగళ అక్కడే ఉన్నాయని రేషన్‌డీలర్లు వాపోతున్నారు. రాష్ట్రంలో 28,916 రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయి. అయితే వీటిని అందిస్తున్న చౌకడిపో డీలర్ల పరిస్థితి ఇతర రాష్ట్రాలతో పోలిస్తే దయనీయంగా ఉందని వారు వాపోతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో డీలర్లకు నెలసరి వేతనాలు ఇస్తుండగా కొన్ని రాష్ట్రాల్లో కిలోకు ఆహార భద్రత చట్టం ప్రకారం 85 పైసలు ఇస్తున్నారు. మన రాష్ట్రంలో 70 పైసలు కమీషన్ ఇస్తున్నారని, దిగుమతి కూలీలు, కరెంటు బిల్లులు ,అద్దెలు, గుమస్తా జీతం, అధికారుల మామూళ్లు ఇలా అన్ని ఖర్చులు ఏటా పెరుగుతూనే ఉన్నాయని వారు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులకు లక్షలో జీతమైతే, సంక్షేమ పథకాలను ప్రజలకు చేరేవేసే డీలర్లకు మాత్రం కమీషన్లతోనే సరిపెడుతున్నారని, 5 టన్నుల బియ్యం కేటాయిస్తే టన్నుకు 700 చొప్పున 5 టన్నులకు కమీషన్ రూ.3500, ఖాళీగోతాలు రూ.1000 మొత్తం రూ.4500 కమీషన్ వస్తుంది. అందులో దిగుమతి కూలీ టన్నుకు రూ.80 చొప్పున 5 టన్నులకు రూ.400, టిఫిన్, టీ, డ్రైవర్ మామూళ్లతో కలిపి రూ.600, చలానా కమీషన్ రూ.100,దండోరా రూ.100, కరెంట్ బిల్ రూ.300 ఇంటి అద్దె గ్రామాల్లో అయితే రూ.1000- రూ.1500, పట్టణాల్లో అయితే రూ.3 వేల నుంచి రూ.3,500 ఉంటుంది. దీనికి తోడు గుమస్తా జీతం, స్టాకు పాయింట్లలో నుంచి వచ్చే బియ్యం బస్తాలో 2 కేజీల నుంచి 3 కేజీల తరుగు, వెరసి కుటుంబం గడవాలంటే ఎంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కోవాల్సి ఉంటుందని డీలర్లు వాపోతున్నారు. ఇదిలా ఉండగా, ఎండీఎం కమీషన్ కింద గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అంటే...2004కు ముందు పనికి ఆహార పథకం కింద రావాల్సిన కమిషన్ ఇప్పటి వరకూ రాలేదని డీలర్లు వాపోతున్నారు. కనీసం 2014లో అధికారం చేపట్టిన తర్వాతైనా దాని గురించి ప్రస్తావించడం లేదని రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమీషన్‌కు బదులు కనీస వేతనాన్ని ఇవ్వాలని, పేద ప్రజలకు ఇస్తున్న విధంగా రేషన్ డీలర్లకు బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకి రుణాలివ్వాలని, డీలర్‌కు పంపిణీ చేసే సరుకులను ప్రభుత్వమే డోర్ డెలివరీ ఇవ్వాలని, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో మాదిరిగా వేతనాలు చెల్లించాలని రేషన్ డీలర్లు డిమాండు చేస్తున్నారు.

## ఈ నెలలోనే మూడో విడత మాఫీ : సీఎం

- ముచ్చుమర్రి ఎత్తిపోతల ప్రారంభం
- హంద్రీ-నీవా కాలువ విస్తరణకు శ్రీకారం



**కర్నూలు/అనంతపురం :** "రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించారు. రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్, 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరతతో మన ప్రయాణం మొదలైంది. ఈ మూడేళ్లలో ఎంతో కష్టపడ్డాం. కేంద్ర ప్రభుత్వం కొన్ని విషయాల్లో కొంతవరకు సహకరిస్తోంది. కానీ, ఇంకా చాలా సహాయం అందాల్సి ఉంది. లోటు బడ్జెట్‌ను భర్తీ చేసేందుకు ఇప్పటికి రూ.4500 కోట్లు మాత్రమే ఇచ్చారు. ప్రత్యేక ప్యాకేజీ నిధులు కూడా రావాల్సి ఉంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆయన కర్నూలు జిల్లా ముచ్చుమర్రిలో, అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన 'జలసిరికి హారతి' కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.325 కోట్లతో నిర్మించిన ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి హంద్రీ నీవా కాలువకు కృష్ణా జలాలు విడుదల చేశారు. నాలుగు పంపులను స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. అనంతరం కృష్ణమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టుచీరను సమర్పించారు. ఉరవకొండ సమీపంలోని ఇంద్రావతి గ్రామం వద్ద హంద్రీ నీవా కాలువ వద్ద జలాలకు పూజలు చేశారు. హంద్రీ నీవా కాలువ విస్తరణతోపాటు... ఉరవకొండలో ప్రయోగాత్మకంగా చేపడుతున్న 'కమ్యూనిటీ లిఫ్ట్ కమ్ డ్రిప్ ఇరిగేషన్' పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నాలుగు ఎత్తిపోతల పథకాలను చేపడతారు. రెండుచోట్లా జరిగిన బహిరంగ సభల్లో ప్రసంగించారు. "నాటి పాలకుల కారణంగా రాష్ట్రం ఎన్నో కష్టాలు అనుభవించాల్సి వచ్చింది. 2004లో నేను మిగులు కరెంట్ ఇస్తే.. 2014లో 22.5 మిలియన్ యూనిట్ల లోటు కరెంట్ ఇచ్చారు. మూడేళ్లల్లో ఎంతో కష్టపడి మళ్లీ మిగులు కరెంట్‌ను సాధించాం. ఇప్పుడు కరెంట్ పోదు. రాష్ట్రంలో కరెంట్ లేని ఇల్లు లేదు. భవిష్యత్తుల్లో విద్యుత్తు చార్జీలు పెంచం. మరింత తగ్గిస్తాం" అని ప్రకటించారు.

### రైతు కోసం మేమున్నాం...

రైతులు కన్నీరు పెడితే రాష్ట్రానికి అరిష్టమని... అందుకే రైతుల సంక్షేమం కోసం నిర్విరామంగా కృషి చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. "దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా 24 వేల రుణమాఫీ చేశాం. ఒకప్పుడు కరెంట్ కోత, ఎరువుల కొరత, నకిలీ విత్తనాలు, కల్తీ పురుగు మందులతో రైతులు సతమతమయ్యేవారు. ఇప్పుడు వాటిని అధిగమించాం. వ్యవసాయం బాగుండాలంటే సాగునీటి ప్రాజెక్టులు నిర్మించాలి. అందుకే వాటికి తొలి ప్రాధాన్యం ఇచ్చాం. ప్రాజెక్టుల నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులందరికి పాదాభినందనం చేస్తున్నా" అని చంద్రబాబు పేర్కొన్నారు. మూడవ విడత రుణమాఫీ సొమ్మును ఈ నెలలోనే రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామన్నారు. రాయలసీమలో కరువును శాశ్వతంగా తరిమికొట్టాలని శ్రీశైలం నుంచి తెలుగుగంగ ద్వారా సీమకు నీళ్లు ఇచ్చిన ఘనత ఎన్టీఆర్‌దేనని ఉద్ఘాటించారు. నదుల అనుసంధానం ద్వారా అన్ని ప్రాంతాలను సస్యశ్యామలం చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని తెలిపారు. "గోదావరి, కృష్ణా నదులను అనుసంధానం చేసి పట్టిసీమ ద్వారా వంద టీఎంసీలు కృష్ణా డెల్టాకు ఇచ్చాం. కృష్ణా డెల్టా నీటివాటాను శ్రీశైలంలో నిల్వ చేసి సీమను సస్యశ్యామలం చేస్తాం. రాష్ట్రంలో 40 నదులు, 40 వేల చెరువులు, 16 లక్షల బోరుబావులు, 6.55 లక్షల పంట కుంటలు ఉన్నాయి. భూగర్భజలాలను పెంచితే కరువును శాశ్వతంగా నిరోధించవచ్చు. తద్వారా నీటిభద్రత కాపాడవచ్చు" అని చంద్రబాబు తెలిపారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని ప్రకటించారు. గోదావరి జలాలు కృష్ణా డెల్టాకు ఇచ్చి... ఆమేరకు శ్రీశైలం నీటిని సీమకు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

## అంబులెన్స్‌లను ఆపొద్దు: పోలీసులకు ఏపీ డీజీపీ ఆదేశాలు



**రాజధాని ప్రత్యేక ప్రతినిధి :** ప్రముఖులు వెళ్లే మార్గాల్లో అంబులెన్సుల రాకపోకల అనుమతిపై ఏపీ డీజీపీ సాంబశివరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అన్ని జిల్లాల పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆపదలో ఉన్న వారిని తరలించేందుకు వీలుగా అంబులెన్స్ లకు దారి ఇవ్వాలని, వాటిని కనుక ఆపితే పోలీసులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రముఖులు వస్తోన్న సమయంలో వాహనాలు ఆపి, అంబులెన్స్‌లను పంపాలని, రహదారులపై వాటిని ఆపొద్దని జిల్లా ఎస్పీలను ఈ మేరకు ఆదేశించారు.


**మహిళా చైతన్య స్రవంతి 'విద్యాకన్నా'**



4 లో







## నోబెల్ శాంతి గ్రహీత పాలనలో

# రోహింగ్యాల రోధన

**భా**రత ప్రధాని మోడీ మయన్మార్ పర్యటనలో ఆంగ్ సన్ సూకితో రోహింగ్యాలపై దారుణ మారణకాండ గురించి ఒక్క మాట మాట్లాడలేదు.

లక్షా పాతికవేల మంది రోహింగ్యా అభాగ్యులు మయన్మార్ సైనికదళాల హింసాకాండను తప్పించుకోడానికి శరణార్థులై సరిహద్దులు దాటుతున్న నేపథ్యంలో ప్రధానిగా మోడీ రెండవసారి మయన్మార్ సందర్శించారు. లోకమంతా ఈ సంక్షోభం గురించి మాట్లాడుతోంది. కాని మన ప్రధాని ఆ విషయమై మౌనమే ఉత్తమం అనుకున్నారు. ఆంగ్ సన్ సూకీతో మాట్లాడిన తర్వాత ఆయన ప్రకటించిన ముఖ్యమైన విషయాలేమంటే, మయన్మార్ పౌరులు భారతదేశం సందర్శించాలంటే నో కాస్ట్ వీసాలిస్తామన్నారు. సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ నినాదానికి అనుగుణంగా మయన్మార్ అభివృద్ధికి తోడ్పడుతామని అన్నారు. (ఇక్కడ భారతప్రజల్లో బడుగు బలహీన మైనారిటీ ప్రజల వికాసం ఏమయ్యిందో). ఇద్దరు నాయకులు టెర్రరిజానికి వ్యతిరేకంగా పోరాడతామని బలంగా చెప్పారు.

మన పొరుగున ఉన్న చైనా అలా భావించడం లేదు. రోహింగ్యా సమస్య పరిష్కారానికి మయన్మార్, బంగ్లాదేశ్ దేశాలకు అవసరమైతే సహాయపడతామని గత ఏప్రిల్ లో ప్రకటించింది. అప్పట్లో దాదాపు 69000 మంది రోహింగ్యాలు మయన్మార్ సైన్యం



దుర్మార్గాలను తప్పించుకోడానికి బంగ్లాదేశ్‌లో శరణుజొచ్చారు. రోహింగ్యా సమస్య అంతర్జాతీయ సమస్యగా మారిన పరిస్థితుల్లో చైనా పెద్దన్న పాత్ర పోషించడానికి వెనుకడుగు వేయడం లేదు. మరోవైపు మయన్మార్ పై అంతర్జాతీయ ఒత్తిడి పెరుగుతోంది. రోహింగ్యాలపై కొనసాగుతున్న హింసా మారణకాండల విషయమై ప్రపంచదేశాలు విమర్శలు సంధిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గూటర్స్ జాతినిర్మూలన స్థాయిలో పరిస్థితి ఉందని చేసిన వ్యాఖ్య గమనించదగింది. భద్రతామండలికి ఆయన లేఖ కూడా ఈ విషయమై రాశారు. ఈ హింసాకాండ తీవ్రమైన మానవ సంక్షోభంగా మారవచ్చని హెచ్చరించాడు. ఈ సంక్షోభంలో బంగ్లాదేశ్ కు అవసరమైన సహాయం అందిస్తామని ఇండోనేషియా చెప్పింది. మయన్మార్ తో దౌత్యసంబంధాలు రద్దు చేసుకోవాలన్న ఒత్తిడి ఇండోనేషియాలో పెరుగుతోంది. దాదాపు పదిలక్షల మంది రొహింగ్యాలపై కొనసాగుతున్న తీవ్రమైన దాడులకు వ్యతిరేకంగా ఆంగ్ సన్ సూకీ నోరిప్పడం లేదు. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ వ్యాఖ్యల తర్వాత భద్రతామండలి ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకునే అవకాశాలున్నాయి. మయన్మార్ మరోవైపు చైనా, రష్యా దేశాలతో సంప్రదింపులు జరుపుతుంది. భద్రతామండలిలో ఏదైనా తీర్మానం వస్తే అడ్డుకోడానికి చైనా, రష్యాలపై ఆధారపడుతోంది. చైనా ఈ విషయమై మయన్మార్ కి సహకరిస్తే అందుకు బదులుగా మయన్మార్ లో చైనా పలుకుబడి పెరుగుతుంది. డోక్లామ్ లో చైనా ఏం చేసిందో మనం చూశాం. నేపాల్ లో చైనా ఏం చేస్తుందో మనకు తెలుసు. పాకిస్తాన్ లో చైనా పలుకుబడి మనకు తెలుసు. బంగ్లాదేశ్, శ్రీలంకలు చైనాను కాదనే స్థితిలో లేవు. మయన్మార్ కూడా అదే బాటన నడుస్తోంది. మన ఇరుగుపొరుగున చైనా ప్రాబల్యం ఎలా పెంచుకుంటుందో గమనించాల్సి ఉంది.

రొహింగ్యాల శరణార్థులది గుండెలు

- మిగతా 2 లో




# రాజధాని వార్తలు

కలం

## పూజలు కాదు, పటిష్టచర్యలు చేపట్టండి

చిన్నప్పుడు తెలుగుమీడియంలో చదివే పిల్లలకు బోల్డన్ని వేమన, సుమతీ శతకాలతోపాటు, బీర్బల్– అక్బర్, తెనాలిరామలింగ, మర్యాదరామన్న తీర్పులు కథలు ఎన్నో ఉండేవి. వాటినుంచి బాలలు చాలా నేర్చుకునేవారు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలు లేవు.నీతికథలూ లేవు.. అన్నీ నారాయణ పరం అయిపోయాయి. మర్యాదరామన్న కథలో ఇద్దరు ఇరుగుపొరుగు అమ్మలక్కలకు గొడవ వచ్చింది. అది తీర్పుకోసం మర్యాదరామన్న దగ్గరకు వెళ్లింది.ఆ ఇద్దర్నీరామన్న రమ్మన్నారు. సుబ్బాయమ్మ, అప్పాయమ్మలు ఆయన దగ్గరికి వెళ్లారు. ఇద్దర్నీ అసలు విషయం ఏమని అడిగారు. నాదగ్గర వీసెడు నెయ్యి అప్పుతీసుకున్న అప్పాయమ్మ తిరిగి ఇవ్వడంలేదని సుబ్బాయమ్మ చెప్పింది. దానికి ఆమెకు రెండు గేదెలే ఉన్నాయి. నాకు 10 గేదెలు ఉన్నాయి. నేను ఆమె దగ్గర అప్పుతీసుకుంటం ఏమిటి? అసలు ఇదంతా అబద్ధం అని తేల్చిచెప్పిందిఅప్పాయమ్మ. అయితే తెలివిగల మర్యాద రామన్న నువ్వు అప్పుతీసుకున్న మాట నిజం అందువల్ల తిరిగి ఇవ్వడం సరైన పద్ధతి అని తీర్పు చెప్పారు. దీనికి అప్పాయమ్మ నివ్వెర పోయింది. ఆయన ఇలా చెప్పుకొచ్చారు.. లోనికి వచ్చేముందు బిందెడు నీళ్లు గుమ్మరించావుగాని కాళ్లు సరిగా కడుక్కోలేదు. అదే సుబ్బాయమ్మ రెండు చెంబులనీటితో ఒబ్బిడిగా శుభ్రంగా కడుక్కుంది. మనకు ఎంత ఉన్నదన్నది ముఖ్యంకాదు ఎంత సద్వినియోగం చేసుకుంటున్నామన్నది ముఖ్యం అన్నారు రామన్న. ఇదే మనం నేర్చుకోవాల్సిన నీతి. ఇదే కథ ముఖ్య మంత్రి చంద్రబాబు కూడా చదివే ఉంటారు. కాని మర్చిపోయి ఉంటారు. నీళ్లు చాలా ముఖ్యం సమస్త జీవకోటికి ఆధారం అది ఎవరూ కాదనలేని సత్యం. పొదుపుగా వాడుకోవడం, నీటిని ఒడిసి పట్టడం ప్రజలకు నేర్పించాలిగాని, ప్రభుత్వాలు పూజా కార్యక్రమాలు చేస్తూ తామేదో గొప్ప కార్యక్రమాలను చేస్తున్నట్లుగా వారిని తాత్కాలిక మురిపాల్లో ముంచెత్తకూడదు. అసలు ప్రభుత్వానికి పూజలతో పనేంటి ? నిజానికి ప్రతిచోటా నిర్వహించే జలహారతితో ఎన్నో శాశ్వత ప్రజోపకార పనులు చేపట్టవచ్చు. రాష్ట్రం అంతటా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యాలతో రోగులు నానా అవస్థలు పడుతుంటే ఒక్క వైద్యశిబిరం కూడా ఏర్పాటు చేయలేదు. ఉన్న ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు లేవు. ఇంట్లో ఒక్కరికి జ్వరం వస్తే ఇంటిల్లిపాదికి అది వ్యాపిస్తుంటే ప్రైవేటు ఆసుపత్రులకు తమ యావధాస్తి ధారపోయాల్సిన పరిస్థితి తలెత్తుతుంటే ప్రభుత్వం మాత్రం ప్రజాధనాన్ని పూజల పేరిట వృధా చేయడం గర్హనీయం.

# రాజధాని నిర్మాణం కోసం కమిటీ నివేదిక భేష్



(మొదటిపేజీ తరువాయి)

ఉండటం, సలహా అడగకపోవడంకూడా దీనికి కారణం అన్నారు. ప్రస్తుత పరిపాలనా విధానం బ్యూరోక్రాట్లను నోరు మూయించే విధంగా ఉందని వాపోయారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో సీఎస్‌గా చేరకముందే చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా పనిచేయడంతో ప్రభుత్వం సలహాలు తీసుకుని ఉండకపోవచ్చని ఆయన చెప్పారు. శివరామకృష్ణ కమిటీలో అందరూ మహానిపుణులు ఉన్నారని వారెంతో మంచి సలహాలను ఇచ్చినప్పటికీ ప్రయోజనంలేకుండా పోయిందన్నారు.

**రాజధానులు నిర్మాణాలు**

లండన్, పారిస్, ఢిల్లీలు ప్రపంచంలోనే మహానగరాలు, రాజధానులు అయితే అవన్నీ అంతగా అభివృద్ధి చెందటానికి దశాబ్ధాల కాలం పట్టింది. అవన్నీ నదీతీరాన అభివృద్ధి చెందినప్పటికీ ప్రస్తుతం నదులన్నీ ఆక్రమణల పాలవడంతో చట్టానికి లోబడి రాజధానులు నిర్మాణంజరపాల్సి ఉంటుందన్నారు. అమెరికా రాజధానిగా అప్పటికే అభివృద్ధి చెందిన న్యూయార్క్‌ను ప్రకటించకుండా వాషింగ్టన్‌ను ప్రకటించారని, అది కేవలం పాలనా నగరం మాత్రమే అని కృష్ణారావు వివరించారు. 1790లో మొదలైన వాషింగ్టన్ నిర్మాణం 20 శతాబ్ధనాటికి విశ్వనగరంగా మారిందన్నారు. న్యూయార్క్ రాష్ట్రరాజధాని కూడా అదే నగరాన్ని ప్రకటించలేదు. ఆబర్నన్ అనే చిన్నపట్టణాన్ని ప్రకటించారని ఆయన గుర్తుచేశారు.

ఆస్ట్రేలియాలో కూడా ఇదే పద్ధతి కొనసాగింది. దాని రాజధానిగా మెల్‌బోర్న్, సిడ్నీకాకుండా కాన్‌బెర్రా అనే చిన్ననగరాన్ని నిర్మించారు. మహావైభవంగా రాజధానిని నిర్మించాలనుకున్న మలేషియా పుత్రజయను నిర్మించింది. కాని దానినిర్వహణా ఖర్చులు తడిసి మోపెడవడంతో పెచ్చులు ఊడి, పైపులు పగిలి పోయాయని, దీనిలో పెద్దఎత్తున ప్రజా ధనం దుర్వినియోగం అయ్యిందన్నారు. బ్రెజీలియా రాజధాని కోసం 1922లో శంఖుస్థాపన జరగ్గా పనులు 1957 ప్రారంభించారని తలకు మించిన భారంగా తయారై అక్కడ మురికివాడలు తయారయ్యాయని కృష్ణారావు వెల్లడించారు. ఏ రాజధాని నగరాలు అప్పటికప్పుడు సాధ్యం కాదు. శతాబ్దాల కాలం పడుతుంది. సమతుల్యం, అందరినీ ఆకర్షించే నగరాలు మాత్రమే మన్ననపొందుతాయని, ప్రస్తుతం ఏర్పాటవుతున్న అమరావతిలో 2035 నాటికి జనాభా 45 లక్షలకు చేరుకోలేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని నిర్మాణానికి సెంట్రలైజేషన్ కుదరదని, అయితే ఈ వెలుసుబాటు తెలంగాణాకు ఉందన్నారు. రామకృష్ణ కమిటీ నిర్ణయం మేరకు దొనబండలో పాలనా నగరం ఏర్పాటు చేసి తిరుపతి, విజయవాడ, విశాఖ పట్నాలను మహానగరాలుగా తీర్చిదిద్దితే బాగుండేదన్నారు. తరిగిపోతున్న అడవులు, వ్యవసాయ భూములను దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను రూపొందించిందని, దాని ప్రకారం పర్యావరణ పరిరక్షణ చర్యలు చేపడుతూ రాజధాని నిర్మాణం జరపాల్సి ఉండగా ప్రభుత్వం పూర్తి వ్యతిరేకంగా నిర్మాణాలు జరిపిందన్నారు. రామకృష్ణనివేదిక ప్రకారం హైకోర్టుకు 140 ఎకరాలు, సచివాలయానికి 20 , శాసనసభకు 100,రాజ్‌భవన్‌కు 15 ఎకరాలు, మొత్తం 275 ఎకరాలు అవసరమవుతాయని ప్రభుత్వం ఇప్పటికే 33 వేల సారవంతమైన భూములను భూసమీకరణ ద్వారా సేకరించి మిగతా వాటిని భూసేకరణ ద్వారా చేపడతాననడం చట్ట వ్యతిరేకమన్నారు. ప్రభుత్వానికి ఏదైన ఒక పద్దతిలో మాత్రమే భూములు తీసుకునే హక్కుందని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వం సేకరించిన భూముల్లో కాసినోవాలు, ఫైవ్‌స్టార్ హోటళ్లు కట్టడం చట్టవిరుద్ధం అని కృష్ణారావు వెల్లడించారు. రాజధాని నిర్మాణంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ)లో కేసు దాఖలు చేశామని, దాని తీర్పు ప్రభావం నిర్మాణంపై ఉంటుందని సంస్థ అధ్యక్షుడు శ్రీమన్నారాయణ వెల్లడించారు. 1000 ఎకరాలను ప్రభుత్వం వినియోగించి మిగతా భూమిని జోన్లుగా విడగొట్టి రైతులుకు ఇవ్వాలని, ప్రస్తుతం మరో 12 వేల అటవీభూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోందని ఇదే జరిగితే పర్యావరణానికి పెనుముప్పు సంభవిస్తుందన్నారు. ప్రజలంతా ఈ అంశంపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

**హైపర్‌లూప్ కాదనను కాని..**

హైపర్‌లూప్ పై ఆయన మాట్లాడుతూ దానిపై తనకు వ్యతిరేకత లేదని, అయితే దాన్ని సమగ్రంగా, సమర్థవంతంగా ఇంతవరకు నిర్వహించిన దాఖలాలు లేవన్నారు. విజయవాడ – సచివాలయం – గుంటూరులను రైల్వేలను అభివృద్ధి చేస్తే ప్రజోపకారంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్‌సాలిడర్స్ అధ్యక్షుడు పండలినేని శ్రీమన్నారాయణ, కమిటీ సభ్యులు, పర్యావరణవేత్తలు, పర్యావరణ ప్రేమికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆరేళ్ల చిన్నారికి చేయూతనందించిన బొండా ఉమ



**విజయవాడ:** సెంట్రల్ టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమ గొప్ప మనసును చాటుకున్నారు. మెదడు సమస్యతో బాధ పడుతూ ఆక్సిజన్ తీసుకోలేకపోతున్న ఆరేళ్ల చిన్నారి కృతికకు ఆయన చేయూత అందించారు. కృతిక శ్వాసతీసుకోలేక ఉన్నట్టుండి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోతుండటంతో ఆమె తల్లిదండ్రులు ఆమెను విజయవాడలోని సిటీ న్యూరో హాస్పిటల్ లో చూపించారు. నరాల బలహీనత వల్ల ఆమెకు తరచుగా ఆక్సిజన్ అందడం లేదని... ఆపరేషన్ చేయడం కుదరదని ఈ సందర్భగా డాక్టర్లు వారికి చెప్పారు. అయితే ఖరీదైన ఇంజెక్షన్లను క్రమం తప్పకుండా తీసుకోవాలని వైద్యులు సూచించారు. ఆటో డ్రైవర్ గా బతుకీడుస్తున్న కృతిక తండ్రికి వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉంది. దీంతో, వారు బొండా ఉమను కలిసి, తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన బొండా ఉమ వారికి కొంత ఆర్థిక సహాయాన్ని అందించారు. అంతేకాదు, చిన్నారికి అవసరమైన మందులన్నింటినీ రాసి ఇస్తే ప్రభుత్వ ఆసుపత్రికి ఇండెంట్ పెట్టి, అందిస్తానని హామీ ఇచ్చారు. చిన్నారికి స్వీట్ బాక్స్ అందించి... ఆమె తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.

## జలసిరిపై పాటలు రాయమన్నారు

**సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్**



**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన జలసిరికి హారతి కార్యక్రమంపై సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ పాటలు రాస్తున్నారు. ఈ పాటలకు వందేమాతరం శ్రీనివాస్ స్వరాలు సమకూరుస్తున్నారు. ఈ సందర్భంగా కడపకు వచ్చిన అనంత శ్రీరామ్ మీడియాతో మాట్లాడుతూ... ఇప్పటికే ఒకపాట పూర్తి చేశానని తెలిపారు. చంద్రబాబు అదేశాల మేరకు ఈ పాటలు రాస్తున్నానని తెలిపారు. ఏపీలో జరుగుతున్న అభివ ృద్ధి కార్యక్రమాలపై పాటలు రాసే అవకాశం తనకు లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రాభివ ృద్ధిలో తనను కూడా భాగస్వామ్యం చేయడం సంతోషంగా ఉందని అన్నారు..



తుళ్లూరు కాలేజీలో టీచర్స్ డే సందర్భంగా గంజి మార్తమ్మను సన్మానిస్తున్న చంద్ర రాధికా రాణి

# రోహింగ్యాల రోధన



(మొదటిపేజీ తరువాయి)

పిండేసే వృత్తాంతాలు, హృదయవిదారకమైన కథనాలు. మయన్మార్ సైనికదళాల దురాగతాల్లో వేలాది మంది ఆహుతయ్యారు. శాంతి బహుమతి గ్రహీత మాత్రం నోరిప్పడం లేదు.

రోహింగ్యాలపై దమనకాండ నెమ్మదిగా సాయుధ పోరాటదళాలు ఏర్పడడానికి కారణమైంది. ఆగష్టు 25వ తేదీన రోహింగ్యా మిలిటెంట్లు అక్కడి భద్రతాదళాలపై దాడులు చేశారు. ప్రతిచర్యగా భద్రతాదళాలు రోహింగ్యా గ్రామాలపై దాడులు చేసి ప్రజలపై కక్ష తీర్చుకోవడం ప్రారంభమైంది. భద్రతాదళాల దాడుల్లో మరణించిన వారంతా అరకాన్ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీకి చెందిన వారని మయన్మార్ చెబుతోంది. కాని గ్రామాలకు గ్రామాలు మంటల్లో తగలబడుతున్న వార్తలు వస్తున్నాయి. రోహింగ్యాలంతా మిలిటెంట్లే అన్నట్లు ప్రభుత్వ ప్రతినిధులు మాట్లాడుతున్నారు.

మలేషియా తన దౌత్యవేత్తను మయన్మార్ నుంచి వెనక్కి పిలుచుకుంది. మాల్దీవ్స్ కూడా మయన్మార్ తో అన్ని సంబంధాలు రద్దు చేసుకుంది. చెచెన్యాలో అనేకమంది రొహింగ్యాలకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. ఆస్ట్రేలియా, ఇండోనేషియాలలో ప్రదర్శనలు జరుగుతున్నాయి. మయన్మార్ దౌత్యకార్యాలయాలపై దాడులు జరిగే ప్రమాదాలు తలెత్తాయి. పాకిస్తాన్ కూడా మయన్మార్ వైఖరిని ఖండించింది, కాని రోహింగ్యా శరణార్థుల కోసం సరిహద్దులు తెరవలేదు. భారతదేశంలో 40వేల మంది రోహింగ్యాలు అక్రమంగా ఉంటున్నారని కేంద్ర మంత్రి అన్నారు. వీరి విషయంలో భారత వైఖరి ఏమిటో చెప్పాలని సుప్రీంకోర్టు కోరింది.

**రోహింగ్యాలెవరు?**

మయన్మార్ బౌద్ధులు అధికంగా ఉన్న దేశం. రోహింగ్యాలు మైనారిటీ తెగ. ముస్లిములు. ప్రస్తుతం 11 లక్షల మంది రోహింగ్యాలు అక్కడ నివసిస్తున్నారని అంచనా. ఇందులో లక్షా పాతికవేల మంది శరణార్థులుగా తరలిపోయారు. రోహింగ్యాలు మాట్లాడే భాష రుయింగ్యా. మయన్మార్ లోని రాఖినే రాష్ట్రంలో నివసిస్తున్నారు. ఈ రాష్ట్రంలోని ఇతర ప్రజలు మాట్లాడే భాషకు భిన్నమైన భాష మాట్లాడతారు. మయన్మార్ లో 135 తెగలు అధికారికంగా మయన్మార్ పౌరసత్వం ఉన్న తెగలుగా గుర్తించబడ్డాయి. కాని రోహింగ్యాలకు అలాంటి గుర్తింపు లేదు. 1982 నుంచి వారికి పౌరసత్వం లేదు. అంటే వాళ్ళు దేశంలేని ప్రజలయ్యారు.

రోహింగ్యాలంతా రాఖినే రాష్ట్రం తీరప్రాంతంలో నివసిస్తున్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా వాళ్ళు ఈ ప్రాంతం వదిలి వెళ్ళరాదు. అంటే అదొక ఓపెన్ జైలు వంటిది వారికి. రాఖినే రాష్ట్రం మయన్మార్ లో అతిపేద రాష్ట్రం. కనీస మౌలిక సదుపాయాలు కూడా అక్కడ కనబడవు.

ఈ విధానం వల్ల బౌద్ధులు అధికంగా ఉన్న మయన్మార్ లో చాలా మంది బౌద్ధులు రోహింగ్యాలను బెంగాలీలుగా భావించడం ప్రారంభించారు. మయన్మార్ స్వతంత్రం పొందిన వెంటనే అంటే 1948లో సిటిజన్ షిప్ చట్టం చేశారు. ఈ చట్టంలో రోహింగ్యాలను పౌరులుగా చేర్చలేదు. అయితే రెండు తరాలుగా నివసిస్తున్న వాళ్ళు గుర్తింపుకార్డు తీసుకోవచ్చన్నారు. ఆ విధంగా కొందరు రోహింగ్యాలకు గుర్తింపు కార్డులు ఇవ్వడం జరిగింది. కొందరికి పౌరసత్వం కూడా లభించింది. పార్లమెంటులో సేవలందించిన రోహింగ్యాలు కూడా ఉన్నారు. మయన్మార్ లో తెగలు, జాతుల ఘర్షణ బయటి ప్రపంచానికి ఇంతవరకు తెలియని విషయంగానే ఉండిపోయింది.

మయన్మార్ లో 1962 సైనిక కుట్ర తర్వాత పౌరులందరూ జాతీయ రిజిస్ట్రేషన్ కార్డులు తీసుకోవాలన్నారు. కాని రోహింగ్యాలకు విదేశీ గుర్తింపు కార్డులు మాత్రమే ఇచ్చారు. ఫలితంగా ఉద్యోగాల్లోను, విద్యావకాశాల్లోను వారికి అవకాశాలు సన్నగిల్లాయి. 1982లో కొత్త పౌరసత్వ చట్టం తెచ్చారు. ఈ చట్టం ప్రకారం రోహింగ్యాలు అసలు మయన్మార్ పౌరులే కాదన్నారు. ఈ చట్టం ప్రకారం ఒక వ్యక్తి కుటుంబం 1948 ముందు నుంచి మయన్మార్ లో నివసిస్తున్నట్లు ఆధారాలు చూపించాలి. జాతీయభాషల్లో ఒక భాష అనర్గళంగా మాట్లాడాలి. రోహింగ్యాలకు ఈ ఆధారాలు సంపాదించి ఇవ్వడం అంత తేలిక కాదు. పైగా వారి భాష జాతీయభాషల్లో లేదు. పౌరులు కాదని తేల్చేసిన తర్వాత వారిపై అనేక ఆంక్షలు పెట్టారు. చదువుకునే హక్కు లేదు. పనిచేసే హక్కు లేదు. ప్రయాణం చేసే హక్కు లేదు. పెళ్ళి చేసుకోవాలన్న ప్రభుత్వ అనుమతి తీసుకోవాలి. వైద్య సేవలు వారికి అందవు. 1970 నుంచి ఒక పద్ధతి ప్రకారం రోహింగ్యాలను నిర్మూలించే కార్యక్రమం చేపట్టారు. ఫలితంగా అనేకమంది పొరుగున ఉన్న బంగ్లాదేశ్ పారిపోయారు. కొందరు మలేషియా తరలిపోయారు. థాయ్ లాండ్ ఇతర తూర్పు ఆసియా దేశాలకు వెళ్ళిపోయిన వారు కూడా ఉన్నారు. దౌర్జన్యాలు, అణిచివేతలు, హింసామారణకాండలు,మానభంగాలు సాధారణమైపోయిన తర్వాత సహజంగానే సాయుధ ప్రతిఘటనలు కూడా మొదలవుతాయి. అక్టోబర్ 2016లో రోహింగ్యా సాయుధ సంస్థ బోర్డర్ పోలీసులపై దాడి చేసింది. ఆ తర్వాత సైనికదళాలు రోహింగ్యా గ్రామాలపై పడి సాధారణ ప్రజలను లక్ష్యంగా చేసుకుని హింసాకాండ కొనసాగిం చాయి. ఐక్యరాజ్యసమితి అధికారి ఒకరు అప్పట్లోనే మయన్మార్ సైన్యం జాతినిర్మూలనకు పాల్పడుతుందని అన్నారు. అంతకు ముందు 2013లో కూడా హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ మయన్మార్ ను అభిశంసిస్తూ జాతినిర్మూలనకు పాల్పడుతుందని చెప్పింది. మొన్న ఆగష్టులో మళ్ళీ సాయుధ రోహింగ్యా సంస్థ పోలీసులపై దాడులకు దిగింది. ఆ వెంటనే సైన్యం రోహింగ్యా గ్రామాలపై పడి మారణకాండ, దహనకాండ, మానభంగాలు, హింసాకాండ కొనసాగించింది. నిరాయుధులైన ప్రజలపై విచక్షణ లేకుండా సైన్యం కాల్పులు జరుపుతున్న సంఘటనలు అనేకం వెలుగులోకి వచ్చాయి. అనేక హక్కుల సంస్థలు ఈ దురాగతాలను రికార్డు చేశాయి.

మయన్మార్ చాన్సలర్ ఆంగ్ సన్ సూకీ రోహింగ్యాల సమస్య గురించి మాట్లాడడానికి కూడా ఇష్టపడడం లేదు. మాట్లాడితే తన పదవి ఊడుతుందన్న భయం ఆమెది. ఆమె ప్రభుత్వం రోహింగ్యాలను పౌరులుగా గుర్తించడం లేదు. టెర్రరిస్టుల వల్లనే ఈ హింసాకాండ జరుగుతుందని చెబుతోంది. నిజానికి సైన్యం పై ఆమెకు అదుపు లేదు. సైన్యం చాలా కాలం ఆమెను గృహనిర్బంధంలో ఉంచిందన్నది మరిచిపోరాదు. సైన్యానికి వ్యతిరేకంగా నోరు విప్పి అణగారిన వర్గాల కోసం మాట్లాడే ధైర్యం ఆమెకు లేదన్నది తేలిపోయింది.

ఆమె ప్రతిష్ట కాపాడ్డానికన్నట్లు సెప్టెంబరు 2016లో ఆంగ్ సన్ సూకి ఒక కమీషన్ నియమించింది. ఐక్యరాజ్యసమితి మాజీ జనరల్ సెక్రటరీ కోఫీ అన్నాన్ సారథ్యంలో రొహింగ్యా సమస్య పరిష్కారానికి ఏర్పరచిన కమీషన్ ఇది. ఈ కమీషన్ కు ఎలాంటి అధికారాలు లేవు. కేవలం కంటితుడుపు చర్య మాత్రమేనని, అంతర్జాతీయంగా తన ప్రతిష‘ కాపాడుకోడానికి ఆమె చేసిన ప్రయత్నం మాత్రమేనని తేలిపోయింది. ఆమె సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు కనబడ్డానికి వేసిన ఎత్తుగడ మాత్రమేనని తెలిసిపోయింది. కోఫీ అన్నాన్ ప్రయాణాలపై ఆంక్షలను, పౌరసత్వంపై ఆంక్షలను తొలగించాలన్నారు. కమీషన్ ఏర్పాటు చేసినప్పుడు కమీషన్ సిఫారసులను అమలు చేస్తామని చెప్పిన సూకీ తర్వాత ముఖం చాటేసింది.

మయన్మార్ నుంచి పారిపోయి వచ్చిన రోహింగ్యాలు అధికంగా బంగ్లాదేశ్ లోనే శరణుజొచ్చారు. తాత్కాలిక శిబిరాల్లో దుర్భర పరిస్థితుల్లో నివసిస్తున్నారు. వారంత ఆక్రమంగా మయన్మార్ నుంచి వచ్చిన శరణార్థులుగా బంగ్లాదేశ్ భావిస్తోంది. రొహింగ్యా శరణార్థులను తిరిగి మయన్మార్ పంపాలని బంగ్లాదేశ్ భావిస్తోంది.

రోహింగ్యాలపై మయన్మార్ సైన్యం దారుణ మారణకాండ, శరణార్థులుగా వచ్చిన రోహింగ్యాల పట్ల వివిధ దేశాలు వ్యవహరిస్తున్న తీరును హ్యూమన్ రైట్స్ వాచ్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తీవ్రంగా విమర్శిస్తున్నాయి. మార్చి నెలలలో ఐక్యరాజ్యసమితి ఒక స్వతంత్ర అంతర్జాతీయ మిషన్ ఏర్పాటు చేసి మయన్మార్ లో రోహింగ్యాలపై దౌర్జన్యాలను విచారించాలన్న తీర్మానాన్ని ఆమోదించింది. ఐక్యరాజ్యసమితి పరిశీలకులకు అనుమతులివ్వడానికి కూడా మయన్మార్ ప్రభుత్వం సిద్ధంగా లేదు. ఐక్యరాజ్యసమితి పరిశీలకులను అనుమతించకపోతే ఉత్తరకొరియా, సిరియా వంటి దేశాల జాబితాలో వేయవలసి వస్తుందన్న హెచ్చరికలు హ్యూమన్ రైట్స్ వాచ్ చేసింది.

ప్రస్తుతం మయన్మార్ సైన్యం ప్రారంభించిన దాడులకు కారణం అగష్టు నెలలో భద్రతాదళాలపై రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ చేసిన దాడులు. ఈ రోహింగ్యా సాల్వేషన్ ఆర్మీ రోహింగ్యా ప్రజలను కాపాడ్డానికి ఏర్పడిన సంస్థ అని మార్చి 2017లో ప్రకటించుకుంది. అంతకు ముందు ఉన్న పేరు అల్ యకీన్ మూవ్ మెంట్ పేరు మార్చింది. ఆత్మరక్షణ నియమాల క్రింద, అంతర్జాతీయ చట్టాల ప్రకారం రోహింగ్యా ప్రజలను కాపాడే ప్రయత్నాలన్నీ చేస్తామని ప్రకటించింది. మయన్మార్ ప్రభుత్వం ఈ సంస్థను టెర్రరిస్టు సంస్థగా పేర్కొంటుంది. అయితే మార్చిలో చేసిన ప్రకటనలో ఈ సంస్థ ప్రపంచంలోని ఏ టెర్రరిస్టు సంస్థతోను ఎలాంటి సంబంధాలు పెట్టుకోమని, ఎలాంటి టెర్రరిస్టు కార్యకలాపాలకు పాల్పడమని కూడా ప్రకటించింది. మయన్మార్ గుర్తించిన 135 జాతులలో బమర్ ముఖ్యమైంది. షాన్, కరీన్, రాఖినే, రోహింగ్యా, కచిన్, చిన్, కరెన్నీ, మోన్, వా, కోకాంగ్ చైనీస్ తదితర జాతులున్నాయి. తెలుగువాళ్ళు కూడా చాలా మంది వెళ్ళారు. రంగమెళ్ళి పోయానో నారాయణమ్మ, రంగూను పురం చేశానో నారాయణమ్మ వంటి పాటలు మనకు తెలిసినవే. మయన్మార్ లో వివిధ తెగల మధ్య స్పర్థలు కూడా ఉన్నాయి. మయన్మార్ చరిత్ర కూడా ఇక్కడ మనం క్లుప్తంగా చూడవలసిన అవసరం ఉంది. అప్పటి రంగూన్ పేరు ఇప్పుడు యాంగాంగ్.

మయన్మార్ లో మేజర్ జనరల్ ఆంగ్ సన్ బామర్ మెజారిటీ ప్రజలకు చెందిన ప్రముఖ నాయకుడు. మయన్మార్ స్వతంత్ర పోరాటంలో కీలకమైన నాయకుడు. మయన్మార్ జాతిపితగా గౌరవం పొందిన నేత. మయన్మార్ స్వతంత్రానికి ఆరు నెలలు ముందే ఆయన హత్య జరిగింది. ఆయన కుమార్తె ఆంగ్ సన్ సూకీ. అంగ్ సన్ హత్య జరక్కుండా ఉన్నట్లయితే మయన్మార్ లో తెగల మధ్య ఘర్షణలు స్పర్థలను రూపుమాపి సమైక్య మయన్మార్ సాధించి ఉండేవాడని అంటారు. మయన్మార్ స్వతంత్రం తర్వాతి నుంచి ఇక్కడ వివిధ మైనారిటీ తెగలు పోరాటాలు కొనసాగిస్తూనే ఉన్నాయి. 1947లో ఆంగ్ సన్ చొరవతో వివిధ తెగల సమావేశం జరిగింది. బామర్ మెజారిటీ ప్రజలు వివిధ మైనారిటీ తెగల ప్రజలు పాల్గొన్నారు. సమైక్య బర్మాకు అవసరమైన ఒప్పంద పత్రం అక్కడ రూపొందింది. కాని ఇప్పుడు ఆ ఆంగ్ సాన్ కుమార్తె ఆంగ్ సన్ సూకీ ఈ సమైక్యతను కొనసాగించడం అనుమానస్పదంగా కనబడుతుంది. బర్మాలో ఈ సంఘర్షణల చరిత్ర 1886 నుంచి కనిపిస్తుంది. బ్రిటన్ బర్మా రాజవంశాన్ని గద్దె నుంచి కూలదోసింది. బర్మాలో మెజారిటీ అయిన బామర్ ప్రజలకు అధికారంలో చోటు కల్పిస్తే తిరుగుబాటు వస్తుందన్న భయంతో బ్రిటీషువారు మైనారిటీ తెగల నాయకులకు ముఖ్యమైన పదవులు కట్టబెట్టారు. రెండవ ప్రపంచయుద్ధంలో ఈ మైనారిటీ తెగల ప్రజలు బ్రిటీషు వారితో కలిసి పోరాడారు. కాని ఆంగ్ సన్, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న బామర్ ప్రజలు జపాన్ పక్షాన పోరాడారు. అయితే జపాన్ ఓడిపోయే పరిస్థితి కనబడడంతో ఆంగ్ సన్ బ్రిటన్ పక్షానికి వచ్చారు. బ్రిటన్ లో చర్చిల్ ఓడిపోయి అట్లీ అధికారంలోకి వచ్చాడు. అట్లీ బర్మాలో మెజారిటీ ప్రజలైన బామర్ ల నాయకుడు ఆంగ్ సన్ నే లండన్ ఆహ్వానించాడు. బామర్ ప్రజలకు స్వతంత్రం ఇస్తానన్నాడు. అంగ్ సన్ బర్మా తిరిగి వచ్చిన తర్వాత చాలా వివేచనతో వ్యవహరించాడు. బర్మాలోని వివిధ మైనారిటీ తెగలను గుర్తిస్తూ పాంగాండ్ కానారేన్సు 1947లో జరిపాడు. ఈ సమావేశంలో షాన్, కరేన్, చిన్ తదితర మైనారిటీ తెగల నాయకులంతా పాల్గొన్నారు. అక్కడ ఈ తెగలన్నింటి మధ్య ఒప్పందం కుదిరింది. యూనియన్ ఆఫ్ బర్మా ఏర్పడింది. అయితే తమ పట్ల అనుచితంగా వ్యవహరించినట్లనిపిస్తే ఏ తెగయినా 10 సంవత్సరాల తర్వాత ఈ ఒప్పందం నుంచి వైదొలగవచ్చు. కాని ఆ తర్వాత ఆంగ్ సన్ హత్య జరగడంతో తెగల మధ్య సయోధ్య ప్రయత్నాలకు గండి పడింది. ఈ వైమనస్యాలు, స్పర్థలు నేటికి కూడా కొనసాగుతున్నాయి. మరో విషయమేమంటే, అంగ్ సన్ పోషించిన పాత్రను మరీ పెంచి చెప్పడం జరుగుతుందని, బామర్ మెజారిటీ ప్రజలకు అనుకూలంగా ఈ చరిత్ర రాయబడుతోందన్న వాదనలున్నాయి. షాన్ తెగ నాయకుడు సావో షూ థాయిక్ పోషించిన పాత్ర మరుగున పడేశారన్న కథనాలున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల ఆంగ్ సన్ సూకీ 21వ శతాబ్దపు పాంగ్లాంగ్ కానారేన్సు ఏర్పాటు చేశారు. వివిధ తెగల నాయకులతో శాంతిచర్చల కోసం ఏర్పరచిన సమావేశం. అయితే ఈ సమావేశంలో ఆంగ్ సన్ సూకీకి, ఆమె పార్టీ ప్రతినిధులకు, బామర్ తెగ ప్రతినిధులకు రాజగౌరవాలు, ఇతర మైనారిటీ తెగలను పురుగుల్లా చూడడం జరిగిందని, కనీసం వారికి కూర్చునే కుర్చీలెక్కడున్నాయో కూడా తెలియలేదని కథనాలు వచ్చాయి.


మయన్మార్ మాన్ రాష్ట్రంలో ఒక స్టీలు బ్రిడ్జి నిర్మిస్తున్నారు. దానికి అంగ్ సన్ పేరు పెట్టారు. కాని స్థానిక తెగ ప్రజలు దీనికి తీవ్రమైన అభ్యంతరం తెలుపుతూ ప్రతిఘటించారు. మయన్మార్ లో బామర్ ప్రజలు 68శాతం ఉన్నారు. మిగిలిన వారంత వివిధ మైనారిటీ తెగలు. మయన్మార్ లో కేవలం బౌద్ధం మాత్రమే లేదు. ఇది బహుళ మతాల దేశం. దాదాపు 6.2 శాతం క్రయిస్తవులున్నారు. చిన్, కచిన్, కరేన్ ప్రజల్లో క్రయిస్తవులున్నట్లు తెలుస్తోంది. అలాగే 4.3 శాతం ముస్లిములున్నారు. బామర్ ప్రజల సంఖ్యను ప్రభుత్వాలు కావాలని ఎక్కువ చేసి చూపిస్తున్నాయనే ఆరోపణ కూడా ఉంది. బామర్ తెగలో అనేక ఉపతెగులున్నాయి. చిన్, కచిన్, కరేన్ తదితర తెగలపై కూడా దౌర్జన్యాలు, హింసాకాండల వార్తలున్నాయి. అందరికంటే అత్యధికంగా, అది దారుణంగా హింసాకాండకు బలవుతుంది రోహింగ్యా ముస్లిములు. ఇదంతా ఎందుకు జరగుతుందంటే, మొత్తం మయన్మార్ బామర్ ప్రజలదే అన్న జాతితత్వం. ఫాసిజం దీనికి కారణాలు. ప్రపంచంలో పలు చోట్ల దారుణమారణ హోమాలకు కారణమైన ఫాసిస్టు భూతమే మయన్మార్ లో తెగల మధ్య చిచ్చు పెడుతుంది. నేడు రోహింగ్యాలు కావచ్చు, రేపు మరో తెగ అవుతుందన్న భయాలు అక్కడ ఉన్నాయి. లోలోన కుతకుతలాడుతున్న లావా అగ్నిపర్వతంలా బద్దలు కావచ్చు. ఈ నేపథ్యంలో మన పొరుగున జరుగుతున్న పరిణామాలకు సకాలంలో సరయిన విధంగా ప్రతిస్పందించవలసిన అవసరం మన ప్రభుత్వం గుర్తిస్తుందా?

– ఖాన్

# ఆమె అక్షరం అగ్నికణిక ఆలోచన పెనుఉప్పెన



**ఆమె అక్షరం సనాతన ఛాందసవాదాన్ని సమూలంగా బూడిదచేసే అగ్నికణిక, ఆమె ఆలోచన బూజుపట్టిన భావాలను తరిమికొట్టే పెను ఉప్పెన. ఆమె ఇంకెవరో కాదు పాత్రికేయ ధీర గౌరీలంకేష్.**



తండ్రినుంచి వారసత్వంగా వచ్చిన లంకేష్ పత్రికను ప్రైవేటు,ప్రభుత్వ ప్రకటనలు లేకుండా కేవలం చందాలతోనూ,పుస్తకాల ప్రచురణలతో వచ్చిన నిధులను వినియోగించుకుంటూ నడుపుతూ అసలు,సిసలైన జర్నలిజాన్ని వారు ప్రజలకు అందిస్తున్నారు. హిందూత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా కలం ఝుళిపిస్తూ, టీవీ చానళ్లు నిర్వహించే చర్చల్లో రాజీలేని వాదనలు వినిపించారు గౌరీ. దీంతో ఆమెకు తీవ్రస్థాయిలో బెదిరింపులు వచ్చాయి. అయితే ప్రాణహాని గురించి ఏనాడూ పట్టించుకోలేదు. ప్రాణహానిపై ఆమెను ప్రశ్నించిన ఒక పాత్రికేయుడికి నేను మహిళను,పురుషుడిని తిట్టినట్లుగా నన్ను తిట్టలేరు. ఎందుకంటే మనదేశంలో మహిళలపట్ల ఇంకా కొంచెం గౌరవం మిగిలి ఉందను కుంటున్నా అని ఆమె సమాజంపై భరోసా కలిగి ఉన్నారు. అయితే అవేమీ ముష్కరుల దాడి నుంచి తప్పించలేకపోయాయి. వారికి కావాల్సింది ఒకటే వారిని ప్రశ్నించేవారిని ఏమాత్రం సహించరు, అంతులేని అసహనం వారిది. 12 శతాబ్దిలోనే మూఢవిశ్వాసాలపై, సామాజిక దుస్సాంప్రదాయాలపై పోరాడిన బసవన్నకు జన్మనిచ్చిన గడ్డలోనే గౌరి తండ్రి పాల్యాడలంకేష్ జన్మించారు. బసవన్న ఆదర్శాలను నరనరానానింపుకున్న ఆయన అదే మార్గంలో నడిచారు. హిందువులు తాత్విక వేత్త బసవన్నకు అనుచరులుకాదనేది ఆమె నిశ్చితాభిప్రాయం. తండ్రి మరణానంతరం ఆయన ఆదర్శాలను గౌరవిస్తూ గౌరి పత్రికను నడుపుతున్నారు.

ఆమె ప్రచురించిన ఒక నివేదికపై గౌరిని కోర్టు దోషిగా తేల్చి 6 మాసాల శిక్ష విధించినా ఆమె కోర్టులో స్టే తెచ్చుకుని నిర్భయంగా ఆమె ఆలోచనలను ప్రజలముందుంచారు. ఆమె ఫేస్‌బుక్ పేజీ తెరిస్తే రోహిత్ వేముల ఫొటో, ట్విటర్ హెడర్‌లో కన్హయకుమార్ ఫొటో ఉంటుంది. భావప్రకటనా స్వేచ్ఛకోసం పోరాడిన దబోల్కర్,పన్సారే, కల్బుర్గీల మాదిరే ఆమెపై కూడా అఘాయిత్యం జరపడం గమనార్హం. 2013 ఆగస్టు 20న సాధన సంపాదకుడు నరేంద్ర దబోల్కర్‌ను ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు సమీపం నుంచి వచ్చి నాలుగుసార్లు కాల్పులు జరిపారు. దబోల్కర్ హత్యపై దర్యాప్తును త్వరగా ముగించాలని హంతకులను పట్టుకోవాలని ప్రముఖ హేతువాది, గోవింద్‌పన్సారే ప్రభుత్వంపై ఒత్తిడి తేవడంతో ఆయన్ను కూడా అలాగే కాల్చి చంపారు. 17వ శతాబ్దానికి చెందిన మరాఠా పాలకుడు ఛత్రపతి శివాజీ గురించి శివాజీ ఎవరు? అనేపుస్తకంలో శివాజీ లౌకికవాదంపై ఆయన రచన రుచించక సనాతన హిందూ సంస్థకు చెందినవారు 2015,జనవరి 20న దుండగులు ఆయన్ను హత్యచేశారు. హంపీ వర్సిటీ మాజీ కులపతి, హేతువాది, కన్నడ భాషారచయితను కూడా అలాగే హత్యచేశారు. ఇదేరకం కాల్పులు గౌరిపై కూడా జరిపారు. వీటిపై బొంబాయి హైకోర్టులో దాఖలైన పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ ఎస్‌సీ ధర్మాధికారి స్పందిస్తూ ఈ హత్యలు చెదరుమదురుగా జరిగినవికాదు, సంస్థాగత మద్దతులేకుండా డబ్బు చేతికందకుండా హంతకులు ఇలాంటి హత్యలకు తెగబడరని వ్యాఖ్యానించడం గమనార్హం. అమెరికా, అమ్నెస్టీ ఇంటర్నేషనల్, ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా, ప్రెస్‌క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ జర్నలిస్టు యూనియన్, పౌరహక్కుల సంఘాలు ఆమె హత్యను తీవ్రంగా ఖండించాయి.

అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఎలా ఆపలేమో, ఆమెను భౌతికంగా హత్యచేసినంతనే ఆమె రగిల్చిన హేతువాద ఆలోచన, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ప్రగతిశీల బాటను ఆపలేం..

మతచాంధసవాదులపై ఆమె ఎక్కుపెట్టిన గన్నులాంటి పెన్ను అక్షరాలకు మరణం లేదు. గింజ భూమిలో పడితే సమాధి అయినట్లు కాదు.. అది మళ్లీ మొలకెత్తుతుంది, ఫలిస్తుంది, గౌరి మనమధ్యలేకపోవచ్చు..కాని ఆమె రగిల్చిన చైతన్యం మనమధ్యఉంది. అదే పత్రికా స్వేచ్ఛను, ప్రజాస్వామ్యాన్ని నిలుపుతుంది. అందుకు ప్రతి భారతీయుడు ఒక గౌరీలా ఉద్యమించాలి.




# పసిడి పరుగు!



**న్యూఢిల్లీ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆర్థిక, రాజకీయ అనిశ్చితి నిర్ణయాలు, ఉత్తరకొరియా సంఘర్షణ వంటి అంశాల నేపథ్యంలో పసిడి పరుగు కొనసాగుతోంది. న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌నైమెక్స్‌లో వారాంతమయిన శుక్రవారం ఔన్స్(31.1గ్రా) ధర భారీగా 12 డాలర్లు పెరిగి ఒక దశలో 1,363 డాటర్లను తాకింది. అయితే చివరకు లాభాల స్వీకరణతో 1,348 స్థాయికి తగ్గింది. ఈ వార్తరాసే కడపటి సమయానికి 1,353 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. 1,300 కీలక మద్దతును దాటిన తర్వాత వేగంగా వారం రోజుల్లో పసిడి భారీ ర్యాలీ చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రధాన కారణాల్లో డాలర్ ఇండెక్స్ పతనం ఒకటి. ఒక దశలో 90.99 స్థాయిని కూడా తాకిన ఈ ఇండెక్స్ 91.20 స్థాయిలో ట్రేడవుతోంది.

**రూపాయి బలోపేతం**

అంతర్జాతీయ మార్కెట్‌లో పసిడి భారీ పతనం భారత్‌లో అంతే స్థాయిలో ప్రభావం చూపకపోవడం మరో విశేషం. డాలర్ పతనం- రూపాయి బలోపేతం దీనికి ప్రధాన కారణం. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ ఎక్సేంజ్‌లో రూపాయి విలువ డాలర్ మారకంలో గురువారంతో పోల్చితే, 27 పైసలు లాభపడి 63.78 వద్ద ముగిసింది. ఇక ముంబై ప్రధాన మార్కెట్‌లో 99.9 స్వచ్ఛత 10 గ్రాముల ధర శుక్రవారం క్రితం ముగింపుతో పోల్చితే రూ.235 పెరిగి రూ.30,510కి చేరింది. ఇక దేశీయ ఫ్యూచర్స్- ఎంసీఎక్స్‌లో ధర కడపటి సమాచారం అందేసరికి గురువారంతో పోల్చితే స్వల్ప నష్టాల్లో ట్రేడవుతోంది. అంతర్జాతీచంగా లేచి పడిన పసిడి ఇందుకు కారణం.

# బిజినెస్

## స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో సామ్‌సంగ్‌దే 43 శాతం వాటా



దేశీయ స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో సామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ దూసుకుపోతోంది. జూలై నెలలో జరిగిన స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల్లో సామ్‌సంగ్ మార్కెట్ వాటా 43 శాతానికి చేరుకుంది. గెలాక్సీ జె సీరిస్ ఫోన్ల విక్రయాలు పెరగడం సామ్‌సంగ్‌కు బాగా కలిసివస్తోంది. దీంతో జూన్ నెలతో పోల్చితే జూలై నెలలో సామ్‌సంగ్ మార్కెట్ వాటా విలువ పరంగా 7.5 శాతం మేర పెరిగిందని జీఎఫ్‌కె గణాంకాల ద్వారా వెల్లడైంది. అమ్మకాల పరిమాణం పరంగా సామ్‌సంగ్ మార్కెట్ వాటా 40 శాతంగా ఉంది. సామ్‌సంగ్ ఇటీవలే గెలాక్సీ జె7 సీరిస్‌లో గెలాక్సీ ఎస్8, ఎస్8 ప్లస్‌లను విడుదల చేసింది. వీటి ద్వారా స్మార్ట్‌ఫోన్ల అమ్మకాల విలువ బాగా పెరిగింది. భారత్‌లో అమ్ముడైన మొత్తం ఫోన్లలో గెలాక్సీ జె సీరిస్ ఫోన్ల వాటా 28.4 శాతం నుంచి 33 శాతానికి చేరింది.

**చైనా కంపెనీలకు దెబ్బ**

చైనా ఫోన్లను కొనుగోలు చేయవద్దని జరుగుతున్న ప్రచారం ఆయా కంపెనీల అమ్మకాలపై పడుతోంది. ఒప్పో, వివో తదితర కంపెనీల అమ్మకాలు జూలైలో 30 శాతం మేరకు తగ్గినట్టు తెలిసింది. వీటి అమ్మకాలు తగ్గడం సామ్‌సంగ్‌కు కలిసి వచ్చింది. ఈ పండగల సీజన్‌లో సామ్‌సంగ్ విక్రయాలు మరింతగా పుంజుకునే అవకాశం ఉందని, దీంతో కంపెనీ అమ్మకాల్లో 30 శాతానికి పైగా వృద్ధి నమోదుకావచ్చని పరిశ్రమవర్గాలు అంచనావేస్తున్నాయి.

# హైపర్‌లూప్... ఆచరణ సాధ్యమేనా!

- తెరపైకి మరో ప్రజా రవాణా వ్యవస్థ
- రూ.1,600 కోట్ల వ్యయ అంచనా
- ప్రపంచంలో ఎక్కడా మొదలుకాని వైనం


**రా.వా.ప్రతినిధి, అమరావతి :** ఆచరణ సాధ్యం కాని మాటలతో చంద్రబాబు ప్రభుత్వం ఇంకా ప్రజలను మభ్యపెడుతూనే ఉంది. నవ్యాంధ్రలో మెట్రో, లైట్ మెట్రో, హైస్పీడ్ రైళ్లు, అంటూ రకరకాల రవాణా వ్యవస్థల పేర్లతో ఊరిస్తున్న ప్రభుత్వం తాజాగా 'హైపర్‌లూప్' అంటూ మరో రవాణా వ్యవస్థను తెరపైకి తీసుకొచ్చింది. దేశంలోనే మొట్టమొదటి ప్రాజెక్టుగా అమరావతి 6 విజయవాడ మధ్య హైపర్‌లూప్ రవాణాకు సంబంధించి హైపర్‌లూప్ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీస్ (హెచ్‌టీటీ) తో ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి బోర్డు (ఏడీబీ) బుధవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) పద్ధతిలో చేపట్టే ఈ ప్రాజెక్టు వ్యయం 250 మిలియన్ అమెరికన్ డాలర్లు (రూ.1600 కోట్లు) అవుతుందని అంచనా, ఈ ప్రాజెక్టు తొలి దశలో భాగంగా 6 నెలల్లో అధ్యయనం చేయాలని, రెండో దశలో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఈ వ్యవస్థ అందుబాటులోకి వస్తే 16 కిలోమీటర్ల దూరమున్న అమరావతి నుంచి విజయవాడకు కేవలం 5 నిముషాల్లోనే చేరుకోవచ్చు. ఈ ప్రాజెక్టులో గంటకు 800 కిలోమీటర్ల వేగంతో నడిచే విధంగా మార్గాన్ని నిర్మించనున్నారు. తద్వారా 2500 మందికి ఉద్యోగావకాశాలు కలుగుతాయి. రెండు నెలల క్రితం ఈ వ్యవస్థ పై అధ్యయనం చేయాలని చంద్రబాబు ఆదేశించగానే అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించారు. ప్రాథమికంగా అంచనాలకు వచ్చి విజయవాడ నుంచి విశాఖపట్నంకు 23 నిముషాలు, తిరుపతికి 25 నిముషాలు, ఇంకా తక్కువ సమయంలోనే హైదరాబాద్‌కు చేరుకోవచ్చని చెప్పడంతో ప్రజలు ఊహల లోకంలో తేలియాడారు. అయితే వాస్తవానికి ఈ వ్యవస్థ అమెరికాలో ఇంకా డిజైన్లను రూపొందించడం, ప్రయోగాల దశలోనే ఉంది. హైపర్‌లూప్ రవాణా వ్యవస్థను రాజధాని అమరావతిలో ఏర్పాటుకు చేస్తున్న హడావుడిని చూసి సర్వత్రా విస్మయం చెందుతున్నారు. రాజధాని అమరావతిని ప్రపంచంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానంటూ మూడేళ్లుగా అరచేతిలో వైకుంఠాన్ని చూపిస్తూ చివరకు హైపర్‌లూప్ రవాణా వ్యవస్థ తెలస్తామనడం మాయాపర్వానికి పరాకాష్టగా అభివర్ణిస్తున్నారు. భవిష్య అవసరాలపై దృష్టిని సారించడంలో తప్పులేదని, అయితే మరీ ఎక్కడాలేని వ్యవస్తను మన రాష్ట్రంలో చేపడతామనడం, అదీకాక అమరావతి- విజయవాడ మధ్య నడుపుతామనడం హాస్యాస్పదంగా ఉందంటున్నారు.

**హైపర్‌లూప్ అసలు కథ ఇదీ....**

మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రజా, సరుకు రవాణా వ్యవస్థలను మరింత వేగవంతం చేసేందుకు ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో అమెరికాకు చెందిన'ఎలెన్ మస్క్' అనే ఇంజనీర్2013 లో ' హైపర్‌లూప్' డిజైన్‌ను రూపొందించారు. 'ఫ్యూచరిస్టిక్ ట్యూబ్ బేస్ట్ హైస్పీడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం'గా వ్యవహరించే ఈ వ్యవస్థలో అధిక పీడనాన్ని కల్పించడం ద్వారా వాయువేగంతో ప్రయాణించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇందుకు ప్రత్యేకంగా మార్గాన్ని నిర్మిస్తారు. హైపర్‌లూప్‌లో గరిష్టంగా గంటకు 1200 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించేందుకు వీలుంటుంది. అంటే విమాన వేగం కంటే ఎక్కువ. తొలుత దీనిని అమెరికాలో లాస్‌ఏంజిల్స్ నుంచి శాన్‌ఫ్రాన్సిస్కో తీర ప్రాంతం వరకూ 559 కిలోమీటర్ల దూరం మార్గాన్ని నిర్మించాలని నిర్ణయించారు. ఈ మార్గంలో గంటకు 970 కిలోమీటర్ల వేగంతో హైపర్‌లూప్‌ను నడపడం వల& కేవలం 35 నిముషాల్లోనే గమ్యం చేరుకోవచ్చని నిపుణులు పేర్కొన్నారు. ఈ వ్యవస్థను ఏర్పాటుచేసేందుకు భారత కరెన్సీ ప్రకారం రూ.40 వేల కోట్ల వ్యయం కానుంది. ఇందుకు సంబంధించి స్పేస్‌ఎక్స్ సంస్థ, హైపర్‌లూప్ వన్ అనే సంస్థలు వివిధ రాకాల డిజైన్లను రూపొందించే పనిలో నిమగ్నమై ఉన్నాయి. స్పేస్‌ఎక్స్ సంస్థ 2015లో అమెరికాలో 1.6 కిలోమీటర్ల మార్గాన్ని ఏర్పాటు చేసి పరీక్షు నిర్వహిస్తోంది. తమ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని కోరుతూ సదరు హైపర్‌లూప్ వన్ సంస్థ 2016 నుంచి భారత్ సహా అనేక దేశాల్లో పర్యటించి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చింది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఫిబ్రవరి 28న ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమైంది. ఈ సందర్భంగా దేశంలో ఢిల్లీ - ముంబై, బెంగుళూరు, ముంబై-చైన్నై మధ్య ఈ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించి సాధ్యాసాధ్యాలపై అద్యయనం చేయాలని కేంద్రం నిర్ణయించింది. అలాగే ప్రపంచంలోనే సంపన్న దేవమైన దుబాయ్‌లో కూడా హైపర్‌లూప్ రవాణా వ్యవస్థను 2020 నాటికి అందుబాటులోకి తెస్తామని అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. హైపర్‌లూప్‌లో అబుదాబి నుంచి దుబాయ్‌కు కేవలం 12 నిముషాల్లోనే చేరుకోవచ్చని తెలిపింది. ఇదిలా ఉండగా అధిక వ్యయంతో కూడుకున్న ఈ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల ఏ మేరకు అమెరికన్ శాస్త్రవేత్తలు అనవసరమనే అభిప్రాయానికి వచ్చినట్లు అనేక కథనాలు కూడా వచ్చాయి. ఈ నేపత్యంలోనే దేశంలోనే మొదటిసారిగా నవ్యాంధ్రలో హైపర్‌లూప్ రవాణా వ్యవస్థ ఏర్పాటుకు ప్రభుత్వం ఆసక్తి చూపడం కేవలం కాలాన్ని వెళ్లదీయడానికి తప్ప మరొకటి కాదని నిపుణులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని పేద అరుపులు అరిచే చంద్రబాబు లగ్జరీ రవాణా వ్యవస్థల కంటే సామాన్యులకు అందుబాటులో ఉండే రవాణా సాధనాలవైపు దృష్టి పెట్టాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని ప్రాంతంలో ఇప్పటికీ అనేక గ్రామాల మధ్య సరైన రవాణా వ్యవస్థ ఏదని, ముందుగా వాటిని అనుసంధానం చేస్తూ రహదారులను నిర్మించి బస్సులను నడిపితే చాలంటున్నారు.

# ఇక వరుస ఎన్నికలు ?

## కార్పొరేషన్లు, నీటి సంఘాలకు త్వరలో!



**రా.వా ప్రతినిధి, అమరావతి :** రాష్ట్రంలో మిగిలిన ఉన్న నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ఎన్నికలు జరిపే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. నంద్యాల ఉపఎన్నికలో టీడీపీ అభ్యర్థి భూమా బ్రహ్మానందరెడ్డి భారీ మెజారిటీతో గెలుపొందటం, కాకినాడ కార్పొరేషన్ ఎన్నికల్లో గెలుపుపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆ పార్టీ నేతల్లో విశ్వాసం మరింతగా పెరగటంతో మిగిలిన స్థానిక సంస్థలకు ఇదే సమయంలో ఎన్నికలు జరిపితే మేలన్న భావంలో సీఎం చంద్రబాబు ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో విశాఖపట్నం, గుంటూరు, ఒంగోలు, తిరుపతి, శ్రీకాకుళం, కర్నూలు నగరపాలక సంస్థలకు ఎన్నికలు జరగాలి. అలాగే కందుకూరు మున్సిపాలిటీ, రాజంపేట నగర పంచాయితీల్లో వార్డుల సంఖ్య, గ్రామాల విలీనంపై కోర్టు గతంలో స్టే ఇచ్చింది. దీంతో పై సంస్థల్లో ప్రత్యేక అధికారుల పాలన సాగుతోంది. అయితే చంద్రబాబు అధికారం చేపట్టిన మూడేళ్ళ తర్వాత అకస్మికంగా వచ్చిన నంద్యాల ఉప ఎన్నికలో భారీ విజయం చేకూరటం, ఆ పార్టీ వర్గాల్లో ఆత్మవిశ్వాసంగా పెంచింది. ఇదే ఊపులో మిగిలి ఉన్న నగర పాలక సంస్థలకు కూడా ఎన్నికలు జరిగితే తెలుగుదేశం విజయం ఖాయమని ఆ పార్టీనేతలు అంచనా వేస్తున్నారు. దీనికి తోడు నంద్యాల ఉప ఎన్నిక ఫలితంతో వైసీపీ శ్రేణులు డీలా పడ్డాయి. పై స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సెప్టెంబర్ 4న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి టీడీపీ సమావేశంలో చంద్రబాబు ఒక నిర్ణయానికి వస్తారని సమాచారం. ఈ సమావేశంలో టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ రాష్ట్రస్థాయి నాయకులు పాల్గొననున్నారు. ఆ తర్వాత పై స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణ గురించి రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని తెలిసింది. ఇదిలావుండగా ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ అక్టోబర్‌లో పులివెందుల నుంచి తిరుపతికి పాదయాత్ర ప్రారంభిస్తానని ఇప్పటికే ప్రకటించారు. అదే సమయానికి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పర్వం ప్రారంభమైతే జగన్ తన పాదయాత్ర వాయిదా వేసుకొని ఈ ఎన్నికలపై దృష్టిపెట్టాల్సి ఉంటుంది. కార్పొరేషన్ ఎన్నికలు ముగిసిన తర్వాత సహకార సంఘాలు, నీటి సంఘాలు ఎన్నికల గడువు సమీపిస్తుంది. వాటికి కూడా ఎన్నికలు నిర్వహిస్తే తమ పార్టీకి అనుకూల విజయం వరిస్తుందని పార్టీ సీనియర్లు చంద్రబాబుకు ఇప్పటికే సూచించినట్లు తెలియవచ్చింది.

దీన్నిబట్టి రానున్న ఆరునెలల కాలం స్థానిక సంస్థలు, సహకార, నీటీ సంఘాలు ఎన్నికల విజయలతో గ్రామాల్లో టీడీపీ శ్రేణులు విజయోత్సాహంతో ఉంటాయని, అదే ఊపును ఆ తర్వాత 2019 ఎన్నికల ముందు పంచాయతీలు, మండలాలు, పదవీకాలం ముగిసిన మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుగుతాయి. పార్టీ అధికారంలో ఉండగానే ఏపీలోని ప్రధాన నగరపాలన సంస్థలన్నీ టీడీపీ పాలకవర్గాలతో నడవటంతో పాటు సహకార, సాగునీటి సంఘాలు ఎన్నికల విజయంతో గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ పట్టు మరింత పెంచుకోవచ్చన్న అభిప్రాయాంతో చంద్రబాబు ఉన్నట్లు తెలియవచ్చింది. ఇదిలావుండగా శిల్పా చక్రపాణిరెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కూడా మరికొద్ది నెలల్లో జరుగుతుంది. ఏదేమైనప్పటికీ నంద్యాల విజయంతో రానున్న కొద్దినెలల్లో నగరపాలన సంస్థల ఎన్నికల నుంచి 2019 ఎన్నికల వరకు వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయని టీడీపీ సీనియర్లు చెబుతున్నారు.

# ప్రజాప్రతినిధుల కుబేర రహస్యమేంటి?

## కేంద్రాన్ని నిలదీసిన సుప్రీం వారంలోగా బదులివ్వాలని ఆదేశం



**న్యూఢిల్లీ :** ప్రజాప్రతినిధుల ఆస్తులు అసాధారణ స్థాయిలో పెరిగిపోయి పదవీ కాలం ఐదేళ్లు ముగిసే సరికి అపర కుబేరులుగా ఎలా మారుతున్నారని కేంద్రప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు నిలదీసింది. రెండు ఎన్నికల మధ్యన 500 శాతం మేర ఆస్తులు పెరగడంతో దాగున్న రహస్యమేమిటనీ ప్రశ్నించింది ఇదంతా చట్టబద్ధ వ్యాపారాల ద్వారా సమకూర్చుకున్నదేనంటూ కొందరు ప్రజాప్రతినిధులు చేసే వాదనలో నిజమెంతని న్యాయమూర్తులు జాస్తి చలమేశ్వర్, ఎస్ అబ్దుల్ నజీర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఎన్నికల సంస్కరణలకు వ్యతిరేకం కాదంటూనే ఈ విషయంలో వెలుగు చూడాల్సిన సమాచారాన్ని కోర్టుకు అందజేయాలని ఆదేశించింది. ప్రజాప్రతినిధుల ఆస్తుల పెరుగుదల చట్టబద్ధమేనా అనేది నిర్ధారించడానికి దర్యాప్తు జరిపించాల్సిన అవసరం ఉందని ఆదేశించింది. ఈ విషయంలో తమతో సమాచారం పంచుకునేందుకు విముఖత చూపుతున్న ప్రభుత్వం తీరును తీవ్రంగా తప్పుపట్టింది. తమ ఆదేశాలకు ఒక వారంలోగా ప్రత్యుత్తరమీయాలని ఆదేశాల్లో ధర్మాసనం స్పష్టం చేసింది. కేంద్రప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదికే రాధాకృష్ణన్ వాదిస్తూ ఎన్నికల్లో పోటీ చేసే వారందరి వ్యవహారాల్లోనూ తలదూర్చలేదన్నారు. అయితే దర్యాప్తు అవసరం ఉందని భావించిన కొన్ని ప్రత్యేక కేటగిరీలకు చెందిన వ్యవహారాల దర్యాప్తు జరిపినల్లు తెలిపారు. అక్రమాస్తులు కూడబెట్టిన ప్రజాప్రతినిధులపై సమగ్ర దార్యప్తు జరిపించాలని కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఛైర్మన్‌కు ఒక ప్రభుత్వేతర సంస్త విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తికి కేంద్రప్రభుత్వం ఇచ్చిన సమాధానమూ చాల డొల్లగా ఉందంటూ, దార్యప్తుకు సంబంధించిన తుది ఫలితాన్ని తేల్చకుండానే దర్యాప్తు తంతును ముగించిన కేంద్రం వైఖరిని సుప్రీంకోర్టు తప్పుపట్టింది.

# ఆర్‌ఎస్‌ఎస్ వ్యతిరేక వార్తలతోనే గౌరీ లంకేష్ హత్య

## బీజేపీ ఎమ్మెల్యే సంచలన వ్యాఖ్యలు

**చిక్‌మంగళూరు :** రాష్ట్రీయ స్వయం సేవక్ భాగంగా అనేక వ్యాసాలు, కథనాలు ప్రచురి సంఘ్(ఆర్‌ఎస్‌ఎస్)కు వ్యతిరేకంగా కథనాలు రాయడం వల్లే సీనియర్ జర్నలిస్టు, సామాజిక కార్యకర్త గౌరి లంకేష్ హత్యకు గురయ్యారని ఓ బీజేపీ శాసనసభ్యుడు స్వయంగా ప్రకటించారు. గౌరి లంకేష్ హత్యకు గురయ్యారని ఓ బీజేపీ శాసనసభ్యుడు స్వయంగా ప్రకటించారు. గౌరి లంకేష్ పత్రికె టాబ్లాయ్డ్‌ను ఆమె స్వయంగా నిర్వహిస్తున్నారు. అందులో దళితులు, ఆదివాసీలు, మావోయిస్టులు, సామాజిక అంశాలతో పాటు హిందూత్వశక్తుల ఆగడాలను గౌరి ఎండగడుతున్నాయి. ప్రజలను చైతన్యవంతం చేయడంలో భాగంగా అనేక వ్యాసాలు, కథనాలు ప్రచురిస్తున్నారు. ప్రత్యేకించి హిందూ మతోన్మాద సంస్థల అరాచకాలు, ఆగడాలను ప్రజలకు వివరిస్తున్నారు. చిక్‌మంగళూరులోని కొప్ప తాలూకాలో జరిగిన ఓ సమావేశంలో గౌరి దారుణహత్యపై బీజేపీ ఎమ్మెల్యే, మాజీమంత్రి జీవరాజ్ స్పందించారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు వ్యతిరేకంగా కథనాలు రాయడం వల్లే ఆమెను కాల్చి ఉంటారని ఆయన అభిప్రాయపడ్డారు. పార్టీ కార్యకర్తల సమావేశంలో జీవరాజ్ చేసిన ప్రసంగం క్లిప్పింగ్ వైరల్ అయింది. 'ఆర్‌ఎస్‌ఎస్ ఊచుకోత శీర్షికతో గౌరి పెద్దవ్యాసం రాశారని ఆయన ప్రస్తావించారు. ఇలాంటి రాతలు రాయకుండా ఉంటే ఆమె జీవించి ఉండేవారని జీవరాజ్ వ్యాఖ్యానించారు. గౌరి లంకేష్ తనకు సోదరి వంటిదని, తమకు వ్యతిరేకంగా వార్తలు రాసినా... ప్రజాస్వామ్యంలో అది ఆమోదయోగ్య మేనని జీవరాజ్ చెప్పారు. ముఖ్యమంత్రి సిద్ధం రామయ్యపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. రాష్ట్రంలో 11 మంది బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్తల హత్యకు కారణమైన వారిపై సీఎం చర్యలు తీసుకోవాలని జీవరాజ్ డిమాండు చేశారు.

# కొత్త నోట్ల ముద్రణలో తలకు మించిన భారం




**ముంబై :** నోట్ల రద్దు ప్రభావం రిజర్వ్ బ్యాంక్ ఆదాయంపై గణనీయంగా పడింది. అందుకే రిజర్వ్ బ్యాంక్ నోట్ల రద్దు చర్య విఫలమైందని ప్రకటించడంతో ఇది కూడా ఒక కారణమని భావిస్తున్నారు. రిజర్వ్ బ్యాంకు లాభాలు పడిపోవడంలో నోట్ల రద్దుకూడా ఒక సాధనంగా పనిచేసింది. ఆ మేరకు రిజర్వ్ బ్యాంక్ నుంచి కేంద్రానికి అందాల్సిన డివిడెండ్ మొత్తం కూడా తగ్గింది. గత ఏడాది రిజర్వ్ బ్యాంక్ నుంచి కేంద్రానికి 65,880 కోట్ల రూపాయల డివిడెండ్ అందంగా ఈ ఏడు అదే కాలంలో 30, 663 కోట్ల రూపాయలు మాత్రమే అందింది. ఈ ఏడు ఆర్థిక సంవత్సరాంతం జూన్ 30 నాటికి రిజర్వ్ బ్యాంక్ ఆదాయంలో 23.56 శాతం కోతపడింది. ఇది 61,818 కోట్ల రూపాయల ఆదాయం లభించింది. రూపాయ విలువ తగ్గడం, విదేశీ కరెన్సీ మారకంలో మార్పులు ఇందుకు కారణం. అంతకు ముందు సంవత్సరంతో పోల్చితే గత సంవత్సరం ఇది (2016-17)0.8 శాతం తగ్గింది. ఇదొక కారణంకాగా, రెండో కారణం... స్థానిక వనరుల నుంచి కనిపించింది. రద్దయిన నోట్లను బ్యాంకుల్లో ప్రజలు డిపాజిట్ చేయడం కోసం తీసుకున్న చర్యలకు 17,426 రూపాయల వడ్డీని ఆర్‌బీఐ చెల్లించాల్సి వచ్చింది. లిక్విడిటీ మేనేజ్‌మెంట్ కార్యకలాపాలకు అంతకు ముందు సంవత్సరం ఆర్‌బీఐకి 506 కోట్ల రూపాయల వడ్డీ లభించింది.

**ఖర్చుల పరంగా....**

ఖర్చుల పరంగా ఆలోచిస్తే, కొత్తగా నోట్లను ముద్రించడానికి 2016-17లో 7,965 కోట్ల రూపాయాల్ని ఆర్‌బీఐ వెచ్చించింది. అంతకుముందు ఏడాదితో పొల్చితే ఇది రెట్టింపు (3,420 కోట్లు) ఉన్నది. 2015-16లో 21.2 బిలియన్ నోట్లు ముద్రించగా 2016-17లో 29 బిలియన్ల కరెన్సీని ముద్రించింది.

# ముష్కరులకు శిక్ష





**ముంబై :** యావత్ భారత దేశాన్ని కలవర పెట్టిన 1993 ముంబై పేలుళ్ల కేసులో గ్యాంగ్‌స్టర్ అబూసలేం, కరీముల్లా ఒసాన్ ఖాన్‌కు టాడా కోర్టు గురువారం జీవిత ఖైదు విధించింది. సుమారు 24 ఏళ్లకు దోషులకు శిక్ష పడింది. 1993 మార్చి 12న ముంబైలోని 12 ప్రాంతాల్లో బాంబులు పేలాయి. 257 మంది చనిపోయారు. 713 మంది గాయపడ్డారు. రూ. 27 కోట్ల మేరకు ఆస్తి నష్టం జరిగింది. జూన్‌లో రెండో విడత విచారణ పూర్తిచేసిన టాడా కోర్టు అబూసలేం ఖయ్యూం అన్సారీ, ముస్తఫా అహ్మద్ ఉమర్ దోసా అలియాస్ ముస్తాఫ మంజూ, కరీముల్లా ఒసాన్ ఖాన్ అలియాస్ కరీముల్లా హుసేన్ హబీబ్ షేక్,ఫిరోజ్ అబ్దుల్ రషీదుఖాన్, రియజ్ సిద్ధిఖీ, తాహిర్ మహ్మద్ మర్చంట్ అలియాస్ తాహెర్ తకల్యాను టాడా కోర్టు దోషులుగా నిర్ధారించిన విషయం విధితమే. వీరిలో ముస్తఫా దోసా గుండెపోటుతో మరణించాడు. దీంతో మిగతా ఐదుగురికి కోర్టు శిక్ష ఖరారు చేసింది. వీరిలో అబూసలెం, కరీముల్లాఖాన్‌కు జీవితఖైదుతో పాటు రూ. 2లక్షల జరిమానా విధించింది. అండర్ వరల్డ్ డాన్, గ్యాంగ్ స్టర్ అబుసలేంను పోర్చుగల్ నుంచి అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. అక్కడి చట్టాల్లో మరణశిక్ష లేకపోవడంతో ఒప్పందం ప్రకారం ఇక్కడ కూడా సలేంకు జీవితఖైదు విధించారు. మరో ఇద్దరు దోషులు తాహెర్ మర్చంట్, ఫిరోజ్ ఖాన్ లపై తీవ్ర ఆరోపణలు దృష్ట్యా మరణ శిక్ష కోర్టు విధించింది. కరీముల్లా ఖాన్‌కు యావజ్జీవ శిక్ష, రియాజ్ సిద్ధిఖీకి 10ఏళ్ల శిక్ష విధిస్తున్నట్లు ప్రకటించింది. ఆధారాల్లేవంటూ మరో నిందితుడు అబ్దుల్ ఖయ్యూమ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. కాగా.. దోషిగా నిర్ధారించిన కొద్దిరోజులకే జూన్ 28న ఆర్థర్ రోడ్డు జైలులో గుండెపోటుతో ముస్తఫా దోసా చనిపోయాడు. ఈ కేసును సీబీఐ విచారణ చేపట్టింది. బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతీకారంగా అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం, టైగర్ మెమన్, మహ్మద్ దోసా, ముస్తఫా దోసా కుట్ర పన్ని మారణహోమం సృష్టించినట్టు సీబీఐ తన విచారణలో తేల్చింది.. ఈ కేసులో ముంబై ప్రత్యేక టాడా న్యాయస్థానం 2007లో విచారణ ముగించింది. అందులో 100 మందిని దోషులుగా తేల్చింది. వీరిలో యాకూబ్ మెమన్‌కు 2013లో సుప్రీంకోర్టు మరణశిక్ష విధించింది. 2015లో ఈ శిక్షను అమలు చేశారు. కేసు విచారణ ముగిసే సమయంలో ముంబై పేలుళ్లతో సంబంధం ఉందంటూ ముస్తఫా దోసా, అబుసలెం సహా మరో ఏడుగురిని అరెస్టు చేశారు. దీంతో వీరిని ప్రధాన విచారణ నుంచి వేరు చేసిన టాడా కోర్టు రెండో విడత విచారణ చేపట్టింది.



### ప్రాసిక్యూషన్ అభియోగాలు

**అబుసలేం :** దావూద్ ఇబ్రహీం సోదరుడు ఎనిస్ ఇబ్రహీం కాస్కర్‌కు సన్నిహితుడు, ఆయుధాలను గుజరాత్ నుంచి ముంబైకి తరలించాడు. ఈ కేసులో దోషిగా శిక్ష పూర్తిచేసుకున్న బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్‌కు కూడా1993 జనవరి16న సలేం ఏకే 56 ఆయుధాలతోపాటు 250 రౌండ్ల బుల్లెట్లు, కొన్ని గ్రానేడ్లను అందించాడు. తిరిగి జనవరి 18న సంజయ్‌దత్ ఇంటికొచ్చి వీటిని అబూసలేం తీసుకెళ్లాడు. బాంబు పేలుళ్ల తరువాత పోర్చుగల్ పారిపోయాడు.





**ముస్తాఫ దోసా :** బాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతీకారంగా భారత్‌తో మారణహోమం సృష్టించాలని దుబాయిలో పన్నిన కుట్రను అమలు చేశాడు. భారత్‌కు ఆయుధాలు పంపించాడు. భారత్‌కు ఆర్డీఎక్స్‌ను తీసుకురావటంలో క్రియాశీలకంగా వ్యవహరించాడు. దీంతోపాటుగా కొందరు యువకులను పాకిస్తాన్‌కు పంపి అయుధాల వినియోగంలో శిక్షణనిప్పించాడు. ఆ తరువాత అరబ్ ఎమిరేట్స్‌కు పారిపోయాడు.

**ఫిరోజ్ అబ్దుల్ రషీద్ ఖాన్ :** ప్రధాన కుట్రదారుల్లో ఒకడు. ముస్తాఫ దోసా భాగస్వామి. గ్యాంగ్ నేరాల్లో సిద్ధ హస్తుడు. తొలి నుంచి కుట్రలో పాలు పంచుకున్నాడు. ఆయుధాలను తీసుకోవటంలో కస్టమ్స్ అధికారులు, ఏజెంట్లతో మాట్లాడి.. జాగ్రత్తగా అనుకున్న లక్ష్యాలను చేర్చాడు. గతేడాది మే చివర్లో అప్రూవర్‌గా మారేందుకు సిద్ధమయ్యాడు.

**తాహెల్ మర్చంట్ :** కుట్రదారుడు, ఉగ్రకార్యకలాపాలను అన్ని ఏర్పాట్లు చేశాడు. తానూ పాల్గొన్నారు. పాకిస్తాన్‌కు ఉగ్ర శిక్షణకు వెళ్లాల్సిన యువకులను గుర్తించి వారిని రెచ్చగొట్టాడు. భారత్‌లో అక్రమంగా ఆయుధ తయారీ కేంద్రాన్ని నెలకొల్పేందుకు నిధులను సేకరించాడు.

**కరీముల్లా ఖాన్ :** ఆర్డీఎక్స్ పేలుడు పదార్థాలు, ఆయుధాలను దాచేందుకు స్థలం ఇచ్చాడు. మహారాష్ట్రలోని రాయ్‌గడ్ జిల్లాలో దాచిన ఆయుధాలు, డిటోనేటర్లు, గ్రనేడ్లను సరైన వ్యక్తులకు చేరవేయటంలో కీలకంగా వ్యవహరించాడు. దుబాయ్ మీదుగా పాకిస్తాన్‌కు వెళ్లి ఆయుధ శిక్షణ పొందాడు.

**రియాజ్ అహ్మద్ సిద్ధిఖీ :** ఎప్పటికప్పుడు ప్రధాన కుట్రదారులతో తత్సంబంధాలను నెరపాడు. కుట్ర లక్ష్యం నెరవేర్చేందుకు అందరినీ సమన్వయ పరిచాడు. అబూసలేం ఆయుధాలు తరలించేందుకు వాహనాన్ని సమకూర్చాడు.

**అబ్దుల్ ఖయ్యూం కరీం షేక్ :** ఆయుధాలను స్మగ్లింగ్ చేశాడు. ఐతే ఈ నేరాన్ని నిరూపించటంలో ప్రాసిక్యూషన్ విఫలమైంది.

# రాజమౌళికి అక్కినేని జాతీయ పురస్కారం

సినిమా

ప్రముఖదర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళికి అక్కినేని జాతీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్టు ఏఎన్నార్ జాతీయ పురస్కార కమిటీ చైర్మన్ టి. సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఈనెల 17న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో భారత ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా రాజమౌళి ఈ పురస్కారాన్ని స్వీకరించనున్నారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో టి సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ తాను మరణించినా అందరిలో జీవించే ఉండాలన్న అక్కినేని ఆలోచనలకి ప్రతిరూపమే ఈ పురస్కారం. కోటి రూపాయల శాశ్వత నిధిని ఏర్పాటు చేసి, దానిపై వచ్చే వడ్డీతో ఈ అవార్డు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇంతవరకు దేవానంద్ మొదలుకుని షబానా అజ్మీ. అంజలీదేవి, వైజయంతిమాల, లతామంగేష్కర్, బాల చందర్, హేమమాలిని, శ్యామ్‌బెనగల్, అమితాబ్ బచ్చన్‌లు అక్కినేని అవార్డును' అందుకున్నారు ఈసారి ఆ గౌరవాన్ని 'బహుబలి' సృష్టికర్త ఎస్.ఎస్.



రాజమౌళి ప్రదానం చేయాలని నిర్ణయించాం. హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో జరిగే సభలో ఆయన పురస్కారాన్ని స్వీకరిస్తారు" అన్నారు. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ అంతర్జాతీయ ఖ్యాతి. గౌరవాన్ని పొందిన కళాకారులకి అక్కినేని జాతీయ అవార్డును అందజేయడం. అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిలిమ్ అండ్ మీడియాను ఏర్పాటు చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్వహించడం... ఈ రెండూ నాన్నగారి కలలు, అంతర్జాతీయంగా తెలుగు వెలుగుల్ని ప్రసరింపజేసిన ఎస్.ఎస్. రాజమౌళిగారికి అక్కినేని అవార్డును అందించనున్నాం. నాలుగైదేళ్ల కిందటే ఏర్పాటైన ఎఐఎస్ఎఫ్ఎం స్కూల్‌లో ఇప్పుడు నాన్నగారు కోరిన అంతర్జాతీయ ప్రమాణాలలోనే వంద మంది విద్యార్థులు పట్టభద్రులు అవుతున్నారు. ఈ వేదికపైనే వారికి డిగ్రీలను అందజేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం" అన్నారు. అన్నపూర్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ ఫిలిమ్ అండ్ మీడియా డైరెక్టర్ అమల మాట్లాడుతూ "ఈ స్కూల్ అక్కినేనిగారి కలల రూపంగా తొలుత 60 మంది విద్యార్థులతో ఏర్పడింది. ఐదేళ్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకొంది. దేశం నలుమూలల నుంచే కాకుండా శ్రీలంక, బంగ్లాదేశ్, ఈజిప్టు, నేపాల్ నుంచి వచ్చిన విద్యార్థులు కూడా ఉన్నారు. సెప్టెంబరు 17న జరిగే కార్యక్రమంలో ఈ స్కూల్‌కి చెందిన విద్యార్థులు తయారుచేసిన లఘు చిత్రాల ప్రదర్శన ఉంటుంది" అన్నారు.

# ఇది ఆరోగ్య సౌందర్య ఫలం

ద్రాక్ష పండు మీద తెల్లని పూత చూసి అదేదో క్రిమి సంహారక మందు అనుకోవద్దు. ఇది సహజమైంది. దిన్ని బ్లూమ్ అంటారు. పండ్లలోని తేమ పాడవకుండా ఫంగస్ చేరకుండా ఈ బ్లూమ్ తోర్పడుతుంది. ఆరోగ్యం కోసమే కాదు, సౌందర్యం కోసం ద్రాక్ష ఎంతో మేలు. రోజు అందరిలో ద్రాక్ష తింటే చర్మం నిగారింపు తో ఎప్పటికి వ ృద్ధాప్య ఛాయల్ని రానీయకుండా అడ్డుకుంటుందని సౌందర్య నిపునులు చెప్పారు. ద్రాక్ష గుజ్జు మొహం పైన రాస్తే, 20 నిమిషాల పాటు దాన్ని మర్దన చేస్తే ముడతలు, నల్లమచ్చలు తగ్గుతాయి. ద్రాక్ష గింజల నూనె అదుతేమైన మాయిస్చురైజర్. పచ్చ ద్రాక్ష జీవక్రియను మెరుగు పరచి చర్మాన్ని కాంతివంతంగా వంచేందుకు సయం చేస్తుంది. రంగు ఎంత ఘాడంగా వుంటే అంత మంచివి, తెలుపు,



లేతాకు పచ్చ ద్రక్షలో కెటబిన్స్ ఆరోగ్యాన్ని రక్షిస్తాయి. ఇది మంచి ఆరోగ్య ఔషద ఫలం. పడుకునే ముందు ద్రాక్ష రసం తాగితే పగలంతా పడిన ఒత్తిడి పోయి హాయి గా నిద్రపడుతుంది.

### ఇలా చేస్తేనే అందం ఆరోగ్యం

వయసొచ్చిన అమ్మాయిలతో అమ్మలకు చాలా కష్టం. హడావుడిగా తిరిగేస్తూ ఏమీ తినమంటారు. అందమంటే సన్నగా ఉండటం అనుకుని స్ట్రిక్ట్ గా వుంటున్నామనుకుని చిరు తిళ్ళ పై పడిపోతారు. అసలు ఇలా చేస్టన్ సరైన పోషకాహారం అందక బరువు పెరుగుతారు . హార్మోన్ల మార్పులతో నెలసరి క్రమం తప్పటం జుట్టు ఊడిపోవటం చాలా చిరాకులోస్తాయి. డాక్టర్లు గట్టిగ పోషకాహారాలు రికమెండ్ చేస్తున్నారు. ఆకు కూరలు త ృణ ధాన్యాలు పాల పదార్థాలు అన్నీ అందాలంటున్నారు. వెన్న లేని పాలు ఇష్టం లేకపోతే పెరుగు తినాలంటున్నారు. నట్స్ నువ్వులు తప్పనిసరి . ముదురురంగుతో వుండే ఆకుకూరలతో పాటు పప్పు ధాన్యాలు సెనగలు రాజ్మా ఉలవలు బొబ్బర్లు గోంగూర పుదీనా మెంతికూర సి విటమిన్ కోసం జామ ఉసిరి నిమ్మ బొప్పాయి కమలా ద్రాక్ష వంటివి శరీరానికి కావలిసిన పోషకాలు ఇస్తాయని సప్లిమెంట్ల జోలికి వెళ్ళద్దనీ మంచి ఆహారపు అలవాట్లతో ఆరోగ్యంగా ఉండమంటున్నారు.



# మరో పదేళ్లు ఆడతా : కోహ్లి

**న్యూఢిల్లీ :** ప్రస్తుతం క్రికెట్ రికార్డుల్ని కొల్లగొడుతోన్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లి తాను మరో పదేళ్లు క్రికెట్ ఆడగలనని విశ్వాసం వ్యక్తం చేశాడు. అందు కోసం ఇప్పటిలాగే ఫిట్‌గా ఉంటే చిలని అన్నాడు చాలా మంది ఆటగాళ్లకు తమ కెరీర్‌ను ఎప్పుడు ముగించాలనే దానిపై స్పష్టత ఉండదు. కానీ నేను ఇప్పుడు శ్రమిస్తున్న తరహా లోనే ముమ్ముందు కూడా కష్టపడితే మరో పదేళు ,, సునాయాసంగా ఆడగలను అని కోహ్లి అన్నాడు.

### క్రికెటర్ల కోసం బీసీసీఐ హ్యాండబుక్

భారత క్రికెటర్లకు అన్ని విషయాల్లోనూ ఉపయోగపడే విధంగా ప్రతీ ప్రొఫెషనల్ క్రికెటర్ కచ్చితంగా తెలుసుకోవాల్సిన 100 విషయాలు అనే పేరిట బీసీసీఐ హ్యాండ్‌బుక్‌ను రూపొందించింది. ఈ పుస్తకానికి ముందుమాట మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ రాశారు.

# మహిళా చైతన్య స్రవంతి 'విద్యాకన్నా'

'మహిళాసాధికారత అంటే కేవలం సంపాదన ఉండటం కాదు! ఇంటి పెత్తనం కాదు! సభల్లో నిర్ణయించటమూ కాదు! ప్రతి మహిళకూ 'చదువు'అందటమే! ఆ చదువే మిగిలినవన్నీ తీసుకొస్తుంది.సరైన నిర్ణయం, తెగువ, ప్రణాళిక, ఆత్మగౌరవాన్ని చదువు మాత్రమే ఇవ్వగలదు'

మహిళా చైతన్య స్రవంతి, బహుముఖ ప్రజ్ఞాశాలి, సార్థక నామధేయని విద్యాకన్నా .. వివిధ సబ్జెక్టుల్లో అరడజనకు పైగా పీజీ డిగ్రీలు ఆమె సొంతం. పి.హెచ్.డి. ఇన్ మేనేజ్‌మెంట్, చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధిపై ఇంగ్లాండులో శిక్షణ పొందారు. కేవలం చదువులతో ఆమె సంతృప్తి పడిపోలేదు. సమాజానికి విస్తృత సేవలందించడం ద్వారా మహిళాసాధికారతకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారారు. మహిళా విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ వారి స్వావలంబనకోసం వృత్తివిద్యాకోర్సులను రూపొందించారు. స్థానిక వనరులతోనే వారిజీవితాల్లో వెలుగులు నింపడానికి నిరంతరం అలుపెరుగని కృషి చేస్తూ, వ్యక్తిత్వ వికాసంతో సామాజిక చైతన్యాన్ని కోసం శ్రమిస్తున్నారు. స్వయంసిద్ధ స్వయం సహాయక గ్రూపు సభ్యులైన మహిళలకు వృత్తి విద్య, ఉపాధి శిక్షణా కార్యక్రమాల ద్వారా శిక్షణనిచ్చి ఉత్పత్తి దిశగా ప్రోత్సహిస్తూ, హెచ్.ఐ.వి./ ఎయిడ్స్ నివారణపై అవగాహనా కార్యక్రమాల ద్వారా హైవే పరిసర గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. బడుగు,బలహీన వర్గాల స్థాయిని మెరుగుపరచటానికి అవసరమైన కీలక వనరుల (విద్య ఉపాధి శిక్షణ) ను సమకూర్చే దిశగా నిరంతరం శ్రమించటం,ఒక సమస్య వచ్చినపుడు అందరికి ఆమోదయోగ్యమైన పరిష్కారాలను కనుగొనటం ఆమె ప్రత్యేకత. ఆర్థికంగా అట్టడుగున ఉన్న మహిళల అభ్యున్నతి కోసం ప్రతి 200 కుటుంబాలకు చెందిన మహిళా సభ్యుల భాగస్వామ్యంతో 'శ్రామిక కమిటీలు' ఏర్పాటు చేశారు. సమిష్టి నిర్ణయాలతో ఉమ్మడి ప్రయోజనాలకై కృషి చేయగల బలమైన సాధనాలుగా రూపుదిద్దుకున్నాయి.జాతీయ స్థాయిలో అక్షరాస్యతా, ఉపాధి కల్పన రంగాలలో విశేషమైన విద్యాకన్నా చేసిన అవిరళ కృషికి ప్రతిష్టాత్మక "ఎన్.ఎల్.ఎమ్ యునెస్కో అవార్డు 2005 లభించింది. 15 ఏళ్లుగా 'ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల శిక్షణా కార్యక్రమాలను, యువతకు, మహిళల స్వయం ఉపాధి/ ఉపాధి





డిమాండును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఏటా సుమారు 120 కోర్సులను నిర్వహిస్తున్నారు.

ఇప్పటివరకు 1,50,000 మంది యువతకువృత్తి ,విద్య, సాంకేతిక శిక్షణ తదితర కార్యక్రమాలను నిర్వహించటం ద్వారా కోస్తా ఆంధ్రాలోని సర్వీసింగ్ సెక్టార్‌లో తనదైన ముద్రను వేయగలిగారు. అంతేకాకుండా 1,00,000 మంది నిరక్షరాస్యులను 'అక్షరాస్యతా కార్యక్రమాలు' ద్వారా విద్యావంతులను చేసిన ఘనత ఆమె సొంతం.

'సెక్స్‌వర్కర్ల' పునరావాసం , బాల కార్మికుల కోసం వారిని పాఠశాలలకు పంపేలా తల్లిదండ్రులను కౌన్సింగ్ చేయటం , పిల్లలను బ్రిడ్జి కోర్సుల ద్వారా సమాయత్తం చేయటం కోసం 'శ్రామిక బాల విద్యా కేంద్రాలు' నిర్వహించారు. మహిళా ఉత్సవ్ కమిటీ కన్వీనర్‌గా రెండు దశాబ్దాలు కాలంగా మహిళలచే తయారు చేయబడిన ఉత్పతులతో మహిళా ఉత్సవ్‌నుప్రతి ఏటా 15రోజుల పాటు జరుపుతున్నారు. 'ఉమన్ ఎంట్రప్రెన్యూర్స్ అసోసియేషన్'కు గౌరవాధ్యక్షులుగా ఉంటూ అనేక ఎగ్జిబిషన్లు, మహిళా చైతనాభివృద్ధి, 'అసోషియేషన్ ఫర్ సెల్ఫ్ ఎంప్లాయిడ్,' ఆంధ్రప్రదేశ్‌కు అధ్యక్షులుగా అనేక కార్యక్రమాలను, సెమినార్లను సింపోజియాలను ఆయా అంశాలలోని నిపుణుల సహకారంతో ఏర్పాటు చేశారు. స్థానిక వడ్డీ వ్యాపారుల బారి నుండి అల్పాదాయ వర్గాల వారిని రక్షించే ఉద్దేశ్యంతో 'స్పెషల్ రివాల్వింగ్ ఫండ్' ను ఏర్పాటు చేసి విద్యాకన్నా మహిళలకు చేయూతనిస్తున్నారు.

'అసోసియేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్స్ ఇండస్ట్రియల్ పార్క్'కు సెక్రటరీ పదవిలో మహిళా పారిశ్రామిక వేత్తల సంక్షేమం, 'కలయిక –కోర్ట్ ఆఫ్ ఉమెన్' జిల్లా కన్వీనర్‌గా మహిళల స్థితిగతులపై మానవీయ కోణంతో అధ్యయనం చేసి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఆఫ్రికాలోని ఇథోపియాలో యాంబో యూనివర్సిటీ 'ఎంట్రప్రెన్యూర్ ఓరియెంటెడ్ ఎకనామిక్స్'కు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. బాలికా సంరక్షణా కార్యక్రమాలైన "సేఫ్, సెక్యూర్డ్, హైజినిక్ ఎన్విరాన్‌మెంట్" (సురక్షిత, క్షేమ,పరిశుభ్రమైన వాతావరణం) వంటి వాటిపై ప్రత్యేక దృష్టితో కార్యక్రమాలు, వీధిబాలలు, బాలనేరస్థులు, ఖైదీలకు ప్రత్యేక దృష్టితో 'పునరావాస చర్యలు' .'నేషనల్ లిటరసీ మిషన్ 'లో ఎగ్జిక్యూటివ్ మెంబరుగా వ్యవహరిస్తూ దేశ వ్యాప్తం అక్షరాస్యతా కార్యక్రమాల నిర్వహణలో కీలక పాత్ర వహిస్తున్నారు.ప్రస్తుతం స్వచ్ఛాంధ్రప్రదేశ్ మిషన్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉన్నారు. రాష్ట్రంలోని అన్ని స్థాయిల్లో పరిశుభ్రత ప్రాముఖ్యత తెలియజేసే ప్రోగ్రాంలు నిర్వహిస్తూ, స్వచ్ఛత – శుభ్రతలపై ప్రజలందరిలోనూ చైతన్యం.. అవగాహనకోసం నడుం బిగించారు. ఆమెతోపాటు పి.వి.సింధు, జ్వాలగుత్తుల, గజల్ శ్రీనివాస్, డా. తిలక్‌లు ఈ మిషన్ కోసం రాష్ట్ర అంబాసిడర్లుగా పనిచేస్తున్నామన్నారు. ఇన్నర్ వీల్,రోటరీక్లబ్ వారి సహకారంతో విద్యార్థులకు స్వచ్ఛభారత్ స్లోగన్స్, పాటలూ పోటీలను నిర్వహించటం ద్వారా తమ పరిసరాలు, ఇళ్లను పరిశుభ్రంగా ఉండేట్లు చేస్తున్నామన్నారు.

ఈనాడు శేషరెడ్డితో కలసి "సర్వశిక్షాఅభియాన్" పై స్పెషల్ స్టోరీస్ తయారు చేయడం ద్వారా జర్నలిజం పీజీకి సార్థకత చేకూరిందని, ఆపై 'అసెంబ్లీని' గమనిస్తూ ప్రత్యేక వార్తలు రాశామని విద్యాకన్నా తన జర్నలిజం ప్రస్తానాన్ని తెలియచేశారు. అలా 'జర్నలిస్ట్' గా ప్రతిరోజు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ప్రతిరోజు కలిసేవారమన్నారు. తర్వాత 'లా' కంప్లీట్ అవటం, జనశిక్షణాసంస్థ డైరెక్టర్‌గా ఉద్యోగబాధ్యతలు నిర్వహించానని చెప్పారు. మహిళాసాధికారత అంటే కేవలం సంపాదన ఉండటం కాదు! ఇంటి పెత్తనం కాదు! సభల్లో నిర్ణయించటమూ కాదు! ప్రతి మహిళకూ 'చదువు'అందటమే! ఆ చదువే మిగిలినవన్నీ తీసుకొస్తుంది.సరైన నిర్ణయం, తెగువ, ప్రణాళిక, ఆత్మగౌరవాన్ని చదువు మాత్రమే ఇవ్వగలదు అని ఆమె మనస్ఫూర్తిగా విశ్వసిస్తారు.

నేనీరోజు ఇలా "మోడ్రన్ పర్స్పెక్టివ్"లో ఉన్నానంటే నా చదువూ తద్వారా వచ్చిన ఉద్యోగం వల్లనేకదా!చదువు ద్వారా మనం అన్ని పరిస్థితులనూ మార్చుకోగలం.."వయోజన, సామూహిక, సంపూర్ణ, అక్షరాస్యత కార్యక్రమాలూ, అక్షర సంక్రాంతి, అక్షర మహిళ, అక్షర భారతి వంటి 447 నిరంతర విద్యాకేంద్రాలతో పనిచేసి ఎందరినో అక్షరాశ్యులను చేసాం.వారికి సర్టిఫికేట్ కూడా ఇచ్చాం..ఇది నాకెంతో సంతృప్తి నిచ్చిన విషయం అని రాజధానివార్తలకు వెల్లడించారు. మహిళాభ్యుదయం కోసం విద్యాకన్నా సేవలు అపూర్వం.. అనితరసాధ్యం ..ఆమెకు ఆల్‌ది బెస్ట్ ..

Printed, Published and Owned by Pattan Hussain Khan, Published at 6-45/1, Rayapudi Post, Thullur Mandal, Guntur District, AP 522237. Printed at Jagathi Publications Ltd., D.No : 5-625, Vadlapudi road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur District, AP. Editor : Pattan Hussain Khan, Cell: 9440662699, Email: info@rajadhanivartalu.com, RNI No. APTEL / 2015 / 66622. Postal Regd. No.GTR/84/2016-18